



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 149 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 3 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥


VOLUME :1 ISSUE :149 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 3 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# రాష్ట్రంలో హింసను ప్రేరేపించాలని చూస్తోంది..


## వైసీపీపై చంద్రబాబు ఫైర్

- అధికారం కోల్పోయామనే అసహనంతో రెచ్చగొట్టేందుకు యత్నం
- ఆ పార్టీ ట్రాప్ లో పడొద్దంటూ పార్టీ నేతలకు సూచన
- మంత్రులు, టీడీపీ సీనియర్ నేతలతో సీఎం టెలీకాన్ఫరెన్స్



ఆంధ్రప్రదేశ్ లో అలజడి సృష్టించాలని, హింసను ప్రేరేపించాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. ఇందులో భాగంగానే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని... ఆ ట్రాప్ లో పడొద్దని టీడీపీ నేతలకు ఆయన సూచించారు. ఈ మేరకు మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో ఆయన ఈ రోజు ఉదయం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.అధికారం కోల్పోయామనే అసహనంతోనే వైసీపీ రెచ్చగొట్టాలని చూస్తోందని చంద్రబాబు చెప్పారు. అందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని, సంయమనం పాటించాలని చెప్పారు. ఈ టెలీకాన్ఫరెన్స్ లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.వైసీపీ రెచ్చగొట్టే చర్యలకు దిగుతోందన్న చంద్రబాబు.. ఆ పార్టీ ఉచ్చులో పడి టీడీపీ శ్రేణులు సంయమనం కోల్పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత సీనియర్ నేతలదేనని చెప్పారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైసీపీ పుట్టిందని, ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ మనకూ తేడా ఉండదని అన్నారు.


ఈ సందర్భంగా తప్పుచేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామని చంద్రబాబు స్పష్టం చేశారు.తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన వైసీపీని రాష్ట్ర ప్రజలు చీదరించుకుంటున్నారని అన్నారు. ఈ క్రమంలో తాము చేసిన పాపాల నుంచి ప్రజల దృష్టి మళ్లించాలని ఆ పార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్న టీడీపీ అజెండా సహజంగానే వైసీపీ నేతలకు నచ్చదని చంద్రబాబు గుర్తుచేశారు. అందుకే అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు.



## నలుగురు మయన్మార్ మాఫియా సభ్యులను ఉరితీసిన చైనా

- మయన్మార్ కేంద్రంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంతో శిక్ష అమలు
- ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గత ఏడాది ఉరిశిక్ష విధించిన కోర్టు
- శిక్షను అమలు చేసినట్లు స్థానిక మీడియా వెల్లడి

- మిగతా 2లో



## దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా స్పందించిన చైనా

- 90 ఏళ్ల వయస్సులో మెడిటేషన్ అనే ఆల్బమ్‌కు అవార్డు
- దలైలామా పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదన్న చైనా
- చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణ

- మిగతా 2లో



## ఇదేనా మీ రూల్ ఆఫ్ లా?

### కూటమి ప్రభుత్వంపై రోజా ఫైర్

- చంద్రబాబు ప్రభుత్వంపై మాజీ మంత్రి రోజా తీవ్ర విమర్శలు
- అధికారంలోకి రాగానే వైసీపీ నేతలపై దాడులు చేస్తున్నారని ఆరోపణ
- పలువురు మాజీ మంత్రులు, నేతల ఇళ్లపై దాడులు జరిగాయన్న రోజా
- ఇదేనా చంద్రబాబు చెప్పిన 'రూల్ ఆఫ్ లా' అని సూటి ప్రశ్న
- సాక్షి, డెక్కన్ క్రానికల్ కార్యాలయాలపైనా దాడులని వెల్లడి

తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నేతలు, వారి ఆస్తులు, పార్టీ కార్యాలయాలే లక్ష్యంగా దాడుల పరంపర కొనసాగుతోందని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఈ పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్న 'రూల్ ఆఫ్ లా' (చట్టబద్ధమైన పాలన) ఇదేనా? అంటూ ఆమె సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా, రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతలపై జరిగిన దాడుల జాబితాను ఆమె వివరించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్, కొడాలి నాని, పేర్ని నాని, దాడిశెట్టి రాజా ఇళ్లతో పాటు, వల్లభనేని వంశీ, ముద్రగడ పద్మనాభం, భూమన కరుణాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వంటి సీనియర్ నేతల నివాసాలపై దాడులు జరిగాయని ఆమె పేర్కొన్నారు. హిందూపురం

- మిగతా 2లో



## ఏపీ, తెలంగాణలకు హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్.. బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు

- తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్న కేంద్రమంత్రి
- బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయింపు
- హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయని వెల్లడి

హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగు పెడతాయని, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైస్పీడ్ కారిడార్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ. 5,454 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ హైస్పీడ్ రైళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలకు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) గేమ్ ఛేంజర్‌గా మారతాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు 3 హైస్పీడ్ రైళ్లు రానున్నాయని, దీంతో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని అన్నారు. పుణేకు గంట 55 నిమిషాలు, చెన్నైకి 2 గంటల 55 నిమిషాల్లో చేరుకోవచ్చని అన్నారు.

## లోక్‌సభలో రాహుల్ vs కేంద్రం..

### ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంపై వాగ్వాదం

- భారత సరిహద్దుల్లోకి చైనా సైన్యం చొరబడిందనే మాట నేను చెప్పింది కాదు: రాహుల్ గాంధీ
- స్వయంగా ఆర్మీ మాజీ చీఫ్ నరవణే తన పుస్తకంలో రాశారని వెల్లడి
- ఈ పుస్తకం బయటకు వస్తే ప్రజలకు విషయం తెలుస్తుందని కేంద్రానికి భయం పట్టుకుందని వ్యాఖ్య
- దేశ భద్రతకు సంబంధించిన అంశాన్ని లోక్ సభలో లేవనెత్తేందుకు అనుమతించడం లేదని ఆరోపణ



లద్దాఖ్, డోక్లాం ప్రతిష్టంభన గురించి కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో లేవనెత్తిన ప్రశ్నలతో గందరగోళం నెలకొంది. చైనా సైన్యం భారత సరిహద్దుల్లోకి చొరబడుతోందని ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే తన పుస్తకంలో రాసిన కొన్ని అంశాలను ఓ మ్యాగజైన్ ప్రచురించింది. ఆ వివరాలను రాహుల్ లోక్‌సభలో ప్రస్తావించారు. ఆయన వ్యాఖ్యలను కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ ఖండించారు. రాహుల్ చెబుతున్న పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని.. ప్రచురితం కాని పుస్తకంలోని అంశాల గురించి ఎలా మాట్లాడతారని

- మిగతా 2లో



## మాకు ప్రాణహాని ఉంది..

### భద్రత కోసం హైకోర్టును ఆశ్రయించిన జోగి రమేశ్


- ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడి చేశాయని పిటిషన్‌లో ఆరోపణ
- దాడి జరుగుతున్నా పోలీసులు చోద్యం చూశారని ఆయన కుమారుడి ఆవేదన
- తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని కోర్టుకు విన్నపం
- లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరపనున్న హైకోర్టు

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ తన భద్రత విషయమై ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని తన నివాసంపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని ఆరోపిస్తూ, తనకు భద్రత కల్పించాలని

- మిగతా 2లో

# పిలిస్తే సిట్ విచారణకు వెళ్లి సహకరిస్తా

- ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై కవిత కీలక వ్యాఖ్యలు
- విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు
- త్వరగా పూర్తిచేసి దోషులను శిక్షించాలని డిమాండ్



తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను తొందరగా ముగించి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారిస్తున్న విషయం తెలిసిందే

- మిగతా 2లో



## వైసీపీ నేతలతో సజ్జల, బొత్స కీలక భేటీ

- అంబటి అరెస్ట్ తో ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు
- తిరుమల ప్రతిష్ఠ దిగజార్చేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్న సజ్జల, బొత్స
- వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### ఏపీలో శాంతి భద్రతల వైఫల్యానికి ఎవరు కారణం?

శాంతి భద్రతల వైఫల్యం ఏ ప్రభుత్వానికైనా చెడ్డపేరు తెస్తుంది. ఎన్ని మంచి పనులు చేసినా.. ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేసినా శాంతిభద్రతల సమస్య మాత్రం ప్రజల్లోకి తొందరగా చొరబడుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలోనూ అదే జరిగింది. నాడు జగన్ ప్రభుత్వం టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడంతో పాటు అనేక రకాలుగా లా అండ్ ఆర్డర్ సమస్య ఆ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడానికి కారణమయింది. ఇప్పుడు అదే సమస్య కూటమి ప్రభుత్వంలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ఎక్కడ చూసినా ఘర్షణలు, హత్యలు, అత్యాచారాలు ప్రభుత్వానికి చెడ్డపేరును తెచ్చిపెడుతున్నాయి.

**శాంతి భద్రతలు...**

నియోజకవర్గాల స్థాయిలో శాంతి భద్రతలు అదుపు తప్పడంపై వాటి ప్రభావం రానున్న ఎన్నికల్లో పడే అవకాశముందన్న ఆందోళన సీనియర్ నేతల్లోనూ వ్యక్తమవుతుంది. అందులో సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే ప్రజలకు తెలిసిపోతుంది. పోలీసులు కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ పోలీసుల తీరు కూడా ఆక్షేపణీయంగానే కనిపిస్తుంది. ఎవరి నుంచి వచ్చిన ఆదేశాలు మాత్రమే తెలియదు కానీ మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ల ఇళ్లపై దాడులు జరిగిన సమయంలో పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. ఇంత బీభత్సం జరుగుతున్నా పోలీసులు పట్టనట్లు వ్యవహరించడాన్ని బట్టి చూస్తే శాంతిభద్రతల పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**వివాదానికి కారణమైన ఫ్లెక్సీలను...**

అసలు వివాదానికి కారణమైన ఫ్లెక్సీలను ముందుగానే పోలీసులు తొలగించి ఉంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. రెండు రాజకీయ పార్టీల మధ్య పోరు ఉన్న సమయంలో వివాదాస్పద ఫ్లెక్సీలను పెడితే ఖచ్చితంగా అక్కడ శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయని చెప్పాలి. ఆ మాత్రం కూడా తెలియకుండా పోలీసు శాఖ నిద్రమత్తులో జోగుతుండటాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తున్నారు. ఆరోజు ఫ్లెక్సీని తొలగించి ఉంటే ఇటు టీడీపీ, అటు వైసీపీ నేతల మధ్య ఘర్షణ తలెత్తి ఉండేది కాదని, అలాగే మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేసిన వారిపై కేసులు పెడితే జోగి రమేష్ ఇంటిపై దాడికి సాహసించి ఉండే వారు కాదన్నది కూడా అంతే వాస్తవమని న్యాయవాదులు కూడా చెబుతున్నారు. ఏపీలో జరుగుతున్న ఈ వివాదాలకు పోలీసుల వైఫల్యమే కారణమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

# వైసీపీ నేతలతో సజ్జల, బొత్స కీలక భేటీ

ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టించాయి. ఈ క్రమంలో రాంబాబుపై కేసు నమోదు కావడం... కోర్టు ఆయనకు రిమాండ్ విధించడం తెలిసిందే. తాజాగా, మరో మాజీ మంత్రి జోగి రమేశ్ పై కూడా కేసు నమోదయింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల వైసీపీ నేతలతో పార్టీ ముఖ్య నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణ భేటీ అయ్యారు. ఈ సమావేశానికి ఈ రెండు ఉమ్మడి జిల్లాలకు చెందిన మాజీ మంత్రులు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, సమన్వయకర్తలు హాజరయ్యారు. ఇటీవల చోటు చేసుకుంటున్న అంశాలపై పార్టీ నేతలు ఎలా స్పందించాలనే అంశంపై సజ్జల, బొత్స సూచనలు చేశారు. తిరుమల ప్రతిష్ఠ దిగజార్చే విధంగా కూటమి వ్యవహరిస్తోందని ఈ సందర్భంగా నేతలు అన్నారు. కూటమి ప్రభుత్వ ఆగడాలను నిలువరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చెప్పారు. పార్టీ నేతలకు భద్రత కల్పించేందుకు పోరాటం చేయాలని తెలిపారు.

# ఇదేనా మీ రూల్ ఆఫ్ లా?

- మొదటి పేజి తరువాయి

వైసీపీ కార్యాలయం, మార్గాని భరత్ కార్యాలయాలపై కూడా దాడి చేశారని తెలిపారు. అంతేకాకుండా, దేవినేని అవినాశ్, విడదల రజినిపై దాడికి యత్నించారని, ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్‌పై దాడి జరిగిందని వివరించారు. తనపై కూడా ఓ వ్యక్తిని ప్రయోగించి బూతులతో దాడి చేయిస్తున్నారని రోజా ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ దాడులు కేవలం రాజకీయ నాయకులకే పరిమితం కాలేదని, పత్రికా కార్యాలయాలపైనా జరిగాయని రోజా ఆరోపించారు. సాక్షి, డెక్కన్ క్రానికల్ మీడియా సంస్థల ఆఫీసులపై జరిగిన దాడులను ఆమె తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ఆమె ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడం దారుణమని, చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని రోజా విమర్శించారు. ఈ దాడులన్నింటికీ ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని ఆమె స్పష్టం చేశారు.

# లోక్‌సభలో రాహుల్ VS కేంద్రం..

## ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంపై వాగ్వాదం

- మొదటి పేజి తరువాయి

రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు.దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సభను అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని అమిత్ షా మండిపడ్డారు. స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ..వార్తాపత్రికల క్లిప్పింగులు, ప్రచురణ కాని పుస్తకాలకు సంబంధించిన విషయాలను లోక్‌సభలో ప్రస్తావించకూడదని రూల్ బుక్ నియమాలను చదివి వినిపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై, ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై మాట్లాడాలని రాహుల్‌కు సూచించారు. మరోవైపు రాహుల్ మాట్లాడుతుండగా మైక్ కట్ చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దీంతో సభాకార్యకలాపాలకు అంతరాయం కలగడంతో లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

# పిలిస్తే సిట్ విచారణకు వెళ్లి సహకరిస్తా

- మొదటి పేజి తరువాయి

. ఈ కేసులో అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధమని చెప్పారు. అధికారులు పిలిస్తే తాను విచారణకు హాజరవుతానని కవిత తెలిపారు. ఈ మేరకు ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మొదలై రెండు సంవత్సరాలు గడిచిందని గుర్తుచేశారు. విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు గుప్పించారు. విచారణ ఇంకెప్పుడు ముగుస్తుందని, దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిట్ విచారణలో ఏం జరిగిందనే వివరాలను కేసీఆర్ బయటపెడతారని భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. కేసు విచారణనే తప్పుబడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడటం సరికాదని కవిత అభిప్రాయపడ్డారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత, అధికారులకు సహకరించాల్సిన విధి ప్రతీ పౌరుడిపైనా ఉందని వ్యాఖ్యానించారు. గుంట నక్కలతో కలిసి డ్రామాలాడుతోందంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె మండిపడ్డారు. తన ఫోన్ ను, తన భర్త ఫోన్ ను ట్యాప్ చేశారనే అనుమానిస్తున్నట్లు చెప్పిన కవిత.. సిట్ విచారణకు అధికారులు పిలిస్తే వెళతానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# మాకు ప్రాణహాని ఉంది..

- మొదటి పేజి తరువాయి

కోరుతూ ఆయన లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఆయన కుమారుడు జోగి రోహిత్ కుమార్ కూడా హైకోర్టులో మరో లంచ్ మోషన్ పిటిషన్ వేశారు.తమ ఇంటిపై దాడి జరిగే అవకాశం ఉందని పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదని రోహిత్ తన పిటిషన్‌లో ఆరోపించారు. గుంపులుగా వచ్చిన వ్యక్తులు దాడి చేస్తుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకుండా కేవలం ప్రేక్షకపాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. తమకు, తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, వెంటనే భద్రత కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

దాడికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆధారాలుగా కోర్టుకు సమర్పిస్తున్నట్లు పిటిషన్‌లో తెలిపారు. ఈ రెండు పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం కాసేపట్లో విచారణ జరపనుంది.

# నలుగురు మయన్మార్ మాఫియా సభ్యులను ఉరితీసిన చైనా

మయన్మార్ కేంద్రంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంగా నలుగురికి చైనాలో ఉరిశిక్ష అమలు చేశారు. ఈ మేరకు బాయి ఫ్యామిలీ మాఫియాకు చెందిన నలుగురికి ఉరిశిక్ష అమలు చేసినట్లు షెంజెన్ ఇంటర్మీడియేట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది. హత్యలు, టెలికాం మోసం, డ్రగ్ ట్రాఫికింగ్‌తో పాటు ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గత ఏడాది కోర్టు ఈ శిక్ష విధించింది. తాజాగా దానిని అమలు చేసింది.

ఆన్‌లైన్ మోసాలతో పాటు వివిధ కేసులు ఎదుర్కొంటున్న ఈ గ్యాంగులపై చైనా కొంతకాలంగా తీవ్ర చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మయన్మార్‌కు చెందిన నేర ముఠాకు చెందిన సభ్యులకు మరణశిక్షను అమలు చేసినట్లు ఇటీవల స్థానిక మీడియా పేర్కొంది.

వేల కోట్ల రూపాయల కుంభకోణాలు, జూద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ మాఫియా, తమ వద్ద పనిచేస్తూ తప్పించుకునేందుకు ప్రయత్నించిన 14 మంది చైనీయుల ప్రాణాలను తీసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలో ముఠాలోని నలుగురికి శిక్షను అమలు చేసినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. అయితే ఈ శిక్షను ఎప్పుడు అమలు చేశారనేది తెలియరాలేదు.

# దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా స్పందించిన చైనా

టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా ప్రతిష్ఠాత్మక గ్రామీ అవార్డు గెలుచుకున్నారు. బెస్ట్ ఆడియో బుక్, నెరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్ రికార్డింగ్ జాబితాలో ఆయన ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. 90 ఏళ్ల వయస్సులో 'మెడిటేషన్' అనే ఆల్బమ్‌కు గాను దలైలామాను ఈ అవార్డు వరించింది. దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. దీనిని ఉపయోగించుకుని చైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది.దలైలామా పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఓ మీడియా సమావేశంలో అన్నారు. మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్న రాజకీయ ప్రవాసి అని ఆయనపై ఆరోపణలు గుప్పించారు.

ఈ అవార్డును బీజింగ్ వ్యతిరేక కార్యకలాపాలకు ఒక సాధనంగా ఉపయోగించుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. దలైలామా మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలను ప్రోత్సహించే వ్యక్తి అన్నారు.

తనకు గ్రామీ అవార్డు రావడంపై దలైలామా స్పందించారు. ఇది తన వ్యక్తిగత విజయంగా చూడటం లేదని అన్నారు. శాంతి, కరుణ, పర్యావరణంపై శ్రద్ధ, మానవత్వం అనేవి మానవాళి శ్రేయస్సుకు అవసరమని పేర్కొన్నారు. గ్రామీ గుర్తింపు ఈ సందేశాలను మరింత విస్తృతంగా వ్యాప్తి చేయడంలో సహాయపడుతుందని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు.

# చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డారు: భూమన కరుణాకర్ రెడ్డి



తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి విషయంలో సీబీఐ నివేదిక వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డారని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే వైసీపీ నేతలపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. నేషనల్ డెయిరీ డెవలప్ మెంట్ బోర్డు ఇచ్చిన నివేదిక ప్రకారమే మాట్లాడానని చంద్రబాబు అంటున్నారని భూమన ఎద్దేవా చేశారు. టీటీడీకి ఈ బోర్డును పరిచయం చేసిందే జగన్ అని చెప్పారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసే అవకాశమే లేదని సీబీఐ తెలిపిందని అన్నారు. చంద్రబాబు హయాంలోనే బోలేబాబా డెయిరీ నుంచి టీటీడీ నెయ్యి కొనుగోలు చేసిందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక బోలేబాబాను డిస్ క్వాలిఫై చేశామని అన్నారు.

తాను చేసిన వ్యాఖ్యలకు అంబటి రాంబాబు క్షమాపణ చెప్పినప్పటికీ దాడులు చేశారని భూమన మండిపడ్డారు. అంబటి ఇంటి మీదకు 3 వేల మంది రౌడీలను పంపించారని అన్నారు. జోగి రమేశ్ ఇంటిపై కూడా ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారని విమర్శించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు జరిగాయని అన్నారు.

# కాపుల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు: నిమ్మల రామానాయుడు



కాపుల సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీకి ఏమాత్రం లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాపుల భవిష్యత్తు ఎప్పటికీ తెలుగుదేశం పార్టీతోనే ముడిపడి ఉందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే మాజీ మంత్రి అంబటి రాంబాబును అడ్డం పెట్టుకుని వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోందని రామానాయుడు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దివంగత తల్లిదండ్రులను ఉద్దేశించి అంబటి వాడిన భాష సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, అంత దారుణంగా మాట్లాడుతున్నా జగన్ ఎందుకు వారించలేదని ప్రశ్నించారు. ఇది జగన్ దర్శకత్వంలోనే జరుగుతున్న డ్రామా అని స్పష్టమవుతోందన్నారు.

**చరిత్రను గుర్తుంచుకోవాలి**

చరిత్రను గుర్తుచేస్తూ.. బ్రిటిష్ కాలం నుంచి ఉన్న కాపు రిజర్వేషన్లను కాంగ్రెస్ ముఖ్యమంత్రులు నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి రద్దు చేస్తే, దామోదరం సంజీవయ్య, చంద్రబాబు మాత్రమే వాటిని పునరుద్ధరించారని రామానాయుడు తెలిపారు. చంద్రబాబు ఎంతో కష్టపడి కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తే, అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ వాటిని రద్దు చేసి కాపులకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. కాపుల ఆరాధ్య దైవం వంగవీటి మోహన రంగాను 'రౌడీ' అని, 'చంపితే తప్పేంటి' అని అన్న గౌతమ్ రెడ్డికి ఆరు నెలల్లోనే ఫైబర్ నెట్ ఛైర్మన్ పదవి ఇచ్చి జగన్ సత్కరించారని మండిపడ్డారు. రంగా హత్యలో నిందితులుగా ఉన్నవారు వైసీపీ ప్రెస్‌మీట్లలో పక్కన కూర్చుని నీతులు చెబుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాపుల కోసం పోరాడుతానన్న ముద్రగడ పద్మనాభం తన పేరు చివర 'రెడ్డి' అని తగిలించుకున్న తర్వాత కాపుల గురించి మాట్లాడటం ఆయన మనస్సాక్షికే వదిలేస్తున్నామన్నారు.

**బూతుల వల్లే వైసీపీ ఓటమి**

అంబటి రాంబాబు, జోగి రమేశ్, కొడాలి నాని వంటి నేతల బూతుల పురాణం కారణంగానే వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిందని, అధికారం కోల్పోయినా వారిలో మార్పు రాలేదని విమర్శించారు. లోకేశ్ పై జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలను మహిళాలోకం అసహ్యించుకుంటోందన్నారు. తప్పు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటే దానికి కులాన్ని ఆపాదించడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పల్నాడు వెళ్లిన టీడీపీ నేతలు బొండా ఉమ (కాపు), బుద్ధా వెంకన్న (బీసీ)పై రాడ్లతో దాడి చేయించినప్పుడు జగన్‌కు వారి కులాలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు.

**చట్టం తనపని తాను చేసుకుపోతుంది**

గతంలో టీడీపీ కార్యాలయంపై వైసీపీ గూండాలు దాడి చేసినప్పుడు అధికారంలో ఉన్న బొత్స సత్యనారాయణకు చట్టం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడూ శాంతిభద్రతలకే పెద్దపీట వేస్తారని, తప్పు ఎవరు చేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని రామానాయుడు గుర్తుచేశారు. రంగాను అవమానించిన వారికి అండగా నిలుస్తున్న వైసీపీకి ఆయన పేరును ఉచ్ఛరించే హక్కు కూడా లేదని, అభివృద్ధిని పక్కనపెట్టి కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ నైజమని మంత్రి తీవ్రంగా విమర్శించారు.

# అన్ని రంగాల్లోనూ జిల్లా ప్రకాశించాలి

## – రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 02**

అన్ని రంగాల్లోనూ జిల్లా ప్రకాశించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చెప్పారు. ప్రకాశం జిల్లా 57వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ప్రకాశం భవనంలో ఘనంగా జరిగింది. ముందుగా ఈ ప్రాంగణంలో ఉన్న ప్రకాశం జిల్లా పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ప్రకాశం పంతులు విగ్రహానికి కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, మేయర్ గంగాడ సుజాత, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్పర్సన్ ఎం.సుచిత్రలతో కలిసి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, మౌలిక రంగాలలో జిల్లాను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఎంతో కీలకమైన వెలుగొండతోపాటు పాలేరు, కొరిశపాడు ప్రాజెక్టులకు కూడా వచ్చే బడ్జెట్లో ప్రాధాన్యం కల్పించబోతున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాలలో సి.బి.జి. ప్లాంట్లు, దొనకొండలో పరిశ్రమల స్థాపన ద్వారా తలసరి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రంతో చర్చిస్తున్నట్లు తెలిపారు. బేస్తవారిపేటకు రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించేలా చర్యలు తీసుకుంటామని, రహదారులు, రైల్వే ప్రాజెక్టుల విషయంలో కేంద్ర సహకారం కోరుతున్నామని చెప్పారు. పామూరులో ట్రిబుల్ ఐటీ ఏర్పాటు చేసేందుకు గతంలో టిడిపి ప్రభుత్వంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని, ఆ నిర్ణయానికి నేడు కూడా కట్టుబడి ఉన్నట్లు మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వెనుకబాటు నుంచి అభివృద్ధి దిశగా పయనిస్తున్న జిల్లాను మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ సహజ, మానవ వనరులను సద్వినియోగం చేసుకుంటూ వెనుకబాటును అధిగమించి అభివృద్ధి చెందిన జిల్లాగా ఆవిష్కృతమయ్యేలా అధికార యంత్రాంగం దృష్టి సారించింది అన్నారు. ఈ ఏడాది వెలుగొండ నీళ్లు వస్తాయన్నారు. రెండు లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వచ్చే నౌకలను ఆపరేట్ చేసే స్థాయిలో రామాయపట్నం పోర్టు అందుబాటులోకి రానున్నదని, బీపీసీఎల్, ఇండోసోల్, ఆక్వా, గెలాక్సీ గ్రానైట్ వంటి పరిశ్రమలు జిల్లాకు వన్నె తెస్తున్నాయన్నారు. హార్టికల్చర్ హబ్ గా కూడా జిల్లా మారుతుందన్నారు. వీటి ద్వారా విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు స్వాతంత్ర సమరయోధుల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహనీయులను అందించిన ప్రకాశం జిల్లాలో విధులు నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. అన్నింటా జిల్లా ముందంజలో ఉండటంలో పోలీస్ శాఖ తరపున అవసరమైన పాత్ర పోషిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర క్అభివృద్ధికి అవసరమైన అవకాశాలు జిల్లాలో పుష్కలంగా ఉన్నాయన్నారు. జిల్లాపై అవగాహన పెంచుకొని ఈ దిశగా తాను దృష్టి సారిస్తానన్నారు. మేయర్ మాట్లాడుతూ ఘన వారసత్వం కలిగిన ప్రకాశం జిల్లా.. అభివృద్ధి విషయంలోనూ తనదైన గుర్తింపు సాధించే దిశగా పయనిస్తోందన్నారు.

సుచిత్ర మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పనిచేస్తే రెట్టింపు అభివృద్ధి సాధించవచ్చు అన్నారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ మహనీయుల ఆశలను స్మరించుకుంటూ జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన వివిధ రంగాల్లోని ప్రముఖులను ఈ కార్యక్రమంలో సన్మానించారు. టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనవళ్ళు అయిన హనుమంతరావు, సంతోష్, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు అయిన కరవది సుబ్బలక్ష్మి, గంగవరపు భాస్కరరావు, ప్రముఖ వైద్యులు, రెడ్ క్రాస్ జిల్లా మాజీ అధ్యక్షులు చలమయ్య, కవులు పాటిబండ్ల ఆనందరావు, పొన్నూరు శ్రీనివాసరావు, సంపత్ కుమార్, నళిని ప్రియా కూచిపూడి నృత్య శిక్షణ సంస్థ వ్యవస్థాపకురాలు శివకుమారి, టెన్నిస్ క్రీడాకారుడు చిరంజీవి సన్మానం పొందారు. జిల్లా విశిష్టతను తెలియజేసేలా ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ అంశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ జయంతి బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

## మార్కాపురం – ప్రకాశం



# మరుగుదొడ్ల పేరుతో మోసం

**బిల్లుల కోసమే నిర్మాణాలు**

**నిబంధనలకు తూట్లు**

**అధికారుల అండతో నాసిరకం పనులు**



**పుల్లల చెరువు పెన్ పవర్ ఫిబ్రవరి 2**

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజల సౌకర్యం పేరుతో స్వచ్ఛాంధ్ర నిధులతో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు అవినీతికి, నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారాయి.ప్రజాధనాన్ని దోచుకునేలా నాసిరక పనులు జరుగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.నిబంధనలు, ప్రమాణాలు అన్నీ పక్కన పెట్టి కేవలం బిల్లుల కోసమే నిర్మాణాలు చేపడుతున్నట్లు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోంది.పనులను పర్యవేక్షించాల్సిన ఆర్డబ్ల్యూఎస్ అధికారులు నిర్మాణ స్థలాన్ని చూడకుండానే అంగీకారం తెలిపినట్లుగా పరిస్థితి ఉంది.అధికారుల మౌనం కాంట్రాక్టర్కు బహిరంగ అనుమతిగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.బలమైన నిర్మాణానికి తప్పనిసరిగా ఉండాల్సిన బేస్ మట్టం లేకుండానే గోడలు లేపేశారు. పక్కన ఉన్న మట్టిని సరిచేసి బేస్ మట్టం వేసినట్లు చూపిస్తూ భీములు పోసిన తీరు చూస్తే ఇది నిర్మాణమా? లేక ప్రజలను మోసం చేసే ప్రయత్నమా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి.కట్టుబడిలో ఇసుకను అధికంగా, సిమెంట్ను నామమాత్రంగా వాడుతున్నారని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.నాణ్యత లేని తయారు సిమెంట్ ఇటుకలను వినియోగించడం ద్వారా నిర్మాణాల ఆయుష్షును కాంట్రాక్టర్ తానే తగ్గించుకుంటున్నాడని విమర్శలు వినిపిస్తున్నాయి.నిర్మించిన గోడలకు కనీసం 21 రోజులు క్యూరింగ్ చేయాల్సి ఉన్నా ఆ ప్రక్రియను పూర్తిగా విస్మరించడం అధికారుల నిర్లక్ష్యానికి మరో ఉదాహరణగా మారింది. మండల, జిల్లా స్థాయి అధికారుల కళ్ల ముందే ఈ అవకతవకలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.ఇది కేవలం నిర్లక్ష్యమా? లేక అవినీతికి మౌన సహకారమా? అని ప్రజలు నిలదీస్తున్నారు. ప్రజల సౌకర్యం పేరుతో చేపట్టిన పనులు చివరకు ప్రజలకే ముప్పుగా మారే పరిస్థితి నెలకొంది.సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నిర్మాణ పనులపై సమగ్ర విచారణ జరిపి, నాసిరక పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్తో పాటు నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రజా దర్బార్ ద్వారా ప్రతి సామాన్యుడి గొంతు నాకు విపిస్తుంది

**కూటమి ప్రభుత్వం ఎప్పుడు ప్రజల పక్షమే**

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం**

**ఎమ్మెల్యే ముత్తుముల 'ప్రజా దర్బార్'...**



**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 2**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటిని త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి వినూత్నంగా ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజా వినతుల ను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 'ప్రజా దర్బార్' కార్యక్రమం నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి, మారుమూల గ్రామాల నుంచి ప్రజలు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. తమ గ్రామాలలోని సమస్యలను, ఇబ్బందులను అర్జీల రూపంలో అందచేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పెన్షన్లు, రేషన్ కార్డుల సమస్యలు, సాగునీరు, తాగునీటి ఇబ్బందులు,భూ సంబంధిత వివాదాలపై ప్రజలు మొరపెట్టుకున్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి , కేవలం అర్జీలు తీసుకోవడమే కాకుండా అక్కడికక్కడే పరిష్కార మార్గాలను చూపుతున్నారు. సమస్య తీవ్రతను బట్టి సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే స్వయంగా ఫోన్ ద్వారా మాట్లాడుతూ. "ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని, గడువులోగా వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని" అధికారులను ఆదేశించారు. కొన్ని సంక్లిష్టమైన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని, నియోజకవర్గ అభివృద్ధికి తాను అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రతి సామాన్యుడి గొంతు తనకు వినిపిస్తుందని, అందుకే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని పేర్కొన్నారు. తమ సమస్యలను ఓపికగా విని, తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## సభ్యత , సంస్కారం లేని

# వైకాపా కొనసాగలేము

**వ్యక్తిగత దూషణలు వైకాపాలో పరిపాటిగా మారాయి**

**గత ఐదేళ్లు ఇదే కొనసాగింది, ఇక భరించే ఓపిక మాలో నశించింది**

**అంబటి వ్యాఖ్యల పై భగ్గుమన్న వైసీపీ శ్రేణులు..**

**ఎమ్మెల్యే ముత్తుముల సమక్షంలో టీడీపీ గూటికి 25 వైకాపా కుటుంబాలు..**



**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 2**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి పై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు, చేసిన అనుచిత వ్యాఖ్యలు గిద్దలూరు నియోజకవర్గంలో రాజకీయ దుమారం రేపాయి. అంబటి వ్యాఖ్యలను నిరసిస్తూ, గిద్దలూరు మండలం గడికోట పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ ముఖ్య నాయకులు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి తెలుగుదేశం పార్టీలో చేరారు. గిద్దలూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, గడికోట గ్రామ పంచాయతీ, దేవనగరం గ్రామానికి చెందిన సుమారు 25 కుటుంబాలకు చెందిన వైసీపీ ముఖ్య నాయకులు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ ముచ్చుకుంట్ల రామసుబ్బయ్య, మాజీ సర్పంచ్ మంద రంగస్వామి, ఎల్ ఐ సి నరసింహులు ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ మారిన నాయకులు మాట్లాడుతూ.. వైసీపీ నేత అంబటి, చంద్రబాబు నాయుడి పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రం కోసం కృషి చేస్తున్న విజన్ ఉన్న నాయకుడు, 4 మార్లు ముఖ్యమంత్రి గా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ముఖ్యమంత్రి పై అంబటి నోరు పారేసుకోవడం సరికాదని మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీశాయని, అటువంటి సభ్యత, సంస్కారం లేని పార్టీలో తాము ఇమడలేమని స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలకు నిరసనగానే తాము వైసీపీని వీడుతున్నట్లు వెల్లడించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని, కేవలం అరాచక పాలన సాగిందని వారు విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ బాటలో పయనిస్తోందని, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సారథ్యంలో గిద్దలూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందని కొనియాడారు. ఎమ్మెల్యే పనితీరు నచ్చే తాము టీడీపీలో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన గుర్రపుసాల రామనారాయణ, చలివేంద్ర వెంకటేశ్వర్లు, బోయిళ్ళ శంకర్ రెడ్డి, మందగిరి పాండు, శివాజీ సింగరయ్య, యన్నం వెంకటేశ్వర్లు, ప్రసాద్, చంద్రశేఖర్, దండు చిన్న పుల్లయ్య, ఆదామ్, లక్ష్మయ్య, గుర్రయ్య, రంగయ్య, గిద్దలూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, మాజీ సర్పంచ్ గోపాల కృష్ణ, ముత్తూరి వెంకటేశ్వర్లు, మరియు మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సమస్యలే ప్రభుత్వ అజెండా : ఎమ్మెల్యే కందుల

**కొనకనమిట్ల పెన్ పవర్ ఫిబ్రవరి 2**

రైతుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొనకనమిట్లలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు,ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రజా దర్బార్లో పలు శాఖలకు సంబంధించి మొత్తం 90 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. భూ సమస్యలు, సాగు నీరు, పింఛన్లు, రేషన్, విద్యుత్, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలపై ఎక్కువగా అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి,సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మండల స్థాయి అధికారులు, రైతులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 3**

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కందుకూరు కు వచ్చిన ఎస్పీ కి పూల బుకేతో స్వాగతం పలికారు. కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య, అలాగే శాంతిభద్రతలపై కొద్దిసేపు ఇద్దరు చర్చించుకున్నారు.

## జయసూర్యకు ఎమ్మెల్యే ఇంటూరి అభినందనలు



**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 2**

వలేటివారిపాలెం మండలంలోని పోకూరు ఎస్సీ కాలనీకి చెందిన దమ్ము థామస్ కుమారుడు జయసూర్య ఇటీవల విడుదలైన గ్రూప్ 2 ఫలితాల్లో విజయం సాధించి, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ లో సబ్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగం సంపాదించారు. ఈ సందర్భంగా టిడిపి కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని జయసూర్య మర్యాద పూర్వకంగా కలవగా, ఎమ్మెల్యే అభినందించారు. ఇంకా కష్టపడి భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. జయసూర్య తండ్రి థామస్, కాలనీవాసులు పర్రే శ్రీను, దాసరి ఆదినారాయణ, బొడ్డు మధు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అబాకస్ పోటీలో శ్రీ శివ సాయి విద్యార్థుల ప్రతిభ



**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 2**

పట్టణంలోని తిరుమల కళ్యాణ మండపంలో జరిగిన కందుకూరు డివిజన్ స్థాయి అబాకస్ పోటీలో ముగ్గురు విద్యార్థులు బహుమతులు సాధించినట్లుగా కరస్పాండెంట్ ఓరుగంటి శివరామయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టార్ జూనియర్ లెవెల్ వన్ లో సి. హెచ్. షణ్మిత; స్టార్ జూనియర్ లెవెల్ 3 విభాగంలో జి. చైత్రిక; జూనియర్ లెవెల్ వన్ విభాగంలో కె. లిఖిత బహుమతులు సాధించారని ప్రిన్సిపల్ పి.శ్రీనివాసులు తెలియజేశారు ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినంధించారు.

## ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఇ.హెచ్.ఎస్) కమిటీలో విశ్రాంత ఉద్యోగులకు ప్రాతినిధ్యం కల్పించాలి



**గిద్దలూరు,పెన్ పవర్, ఫిబ్రవరి 2**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు,విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న ఆరోగ్య పథకం (ఇ. హెచ్. ఎస్ ) కమిటీలో విశ్రాంత ఉద్యోగ సంఘానికి కూడా ప్రాతినిధ్యం కల్పించాలని సంఘ రాష్ట్ర కార్యదర్శి గొటిక రవీంద్ర నాథ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఇ.హెచ్.ఎస్ కమిటీలో గతంలో కొనసాగుతున్న రెండు ఉద్యోగ సంఘాలతో పాటు మరో రెండు సంఘాలకు కమిటీలో చోటిచ్చారని, కానీ సుమారు 4లక్షల మంది విశ్రాంత ఉద్యోగుల సంక్షేమాన్ని బాధ్యతగా తీసుకొని పని చేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘానికి కమిటీలో స్థానం కల్పించకపోవడం శోచనీయం అన్నారు. అనారోగ్యంతో, వృద్ధాప్య సమస్యలతో సతమతమవుతున్న రిటైర్డ్ ఉద్యోగులే అధిక సంఖ్యలో ఇ.హెచ్.ఎస్ ద్వారా వైద్య చికిత్సలు పొందుతారు.అలాంటి వారి కోసం ఏర్పడ్డ విశ్రాంత ఉద్యోగుల ప్రాతినిధ్యానికి కమిటీలో చోటు కల్పించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాష్ట్రంలో అన్ని జిల్లా,మండల కార్యవర్గాలు వినతులు సమర్పించాలని రవీంద్రనాథ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఆకవీడులో వైభవంగా శ్రీ చిన్నయ్య స్వామి జెండా మహోత్సవం


## బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 2**

రాచర్ల మండలం, ఆకవీడు గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ చిన్నయ్య స్వామి జండా మహోత్సవం కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి ఆలయమర్యాదలతో ఘనస్వాగతం పలికారు. జండా మహోత్సవం ను పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను (ఎడ్ల పందాలు) ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రారంభించారు. అశోక్ రెడ్డి తల పాగాచుట్టి ఛర్నా కోలా చేతపట్టి , ఎడ్ల పగ్గాలను బిగియబట్టి అశేషాజనవాహిని విశేషంగా వీక్షిస్తుండగా ఛర్నాకోలా ఝుళిపించి బండ పందెం ను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడలను, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. పల్లె సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఇటువంటి బండలాగుడు పోటీలు రైతన్నల్లో ఉత్సాహాన్ని నింపుతాయని కొనియాడారు. పోటీల్లో పాల్గొన్న ఎడ్ల యజమానులను, రైతులకు ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ చిన్నయ్య స్వామి



వారిని దర్శించుకుని, ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కు తీర్థప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనాలు



అందించారు. ఈ ఆధ్యాత్మిక , క్రీడా కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట రాచర్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు జనసేన బీజేపీ పార్టీల నాయకులు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భారీ సంఖ్యలో భక్తులు, రైతులు పాల్గొన్నారు.

# ఐఐటి - మద్రాస్ నుంచి ప్రకాశం కళాశాల అధ్యాపకుడికి అరుదైన గౌరవం



**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 2**

ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ యిక్కుర్తి రామ కోటేశ్వరరావు కి ఐఐటీ, మద్రాస్ ఆధ్వర్యంలోని జాతీయ సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత అభ్యాస కార్యక్రమం ద్వారా మూడు విశిష్ట గౌరవాలు లభించాయి. ఈ గౌరవాలను ఐఐటీ మద్రాస్ ప్రాంగణంలో ఆయన స్వయంగా స్వీకరించారు. 2025 జూలై నుండి డిసెంబర్ వరకు జరిగిన విద్యా కాలంలో ఆయన మొత్తం 11 సర్టిఫికేషన్లు విజయవంతంగా పూర్తి చేసి, ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. నిరంతర అధ్యయనం, క్రమశిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై లోతైన ఆసక్తి వంటి లక్షణాల కారణంగా ఆయనకు "ఎన్పీటీఈఎల్ బిలీవర్", "ఎన్పీటీఈఎల్ ఎన్థూసియస్ట్", "ఎన్పీటీఈఎల్ డిసిప్లైన్ స్టార్" అనే మూడు ప్రతిష్టాత్మక బిరుదులు 2026 జనవరి 1న ప్రదానం చేయబడ్డాయి.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, రామ కోటేశ్వరరావు సాధన సంస్థకు గర్వకారణమని పేర్కొన్నారు. అధ్యాపకులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవడం వల్ల విద్యార్థులకు సమకాలీన, నాణ్యమైన బోధన అందుతుందని తెలిపారు. ఇలాంటి విజయాలు సంస్థ విద్యా దృష్టికోణాన్ని ప్రతిబింబిస్తాయని, అధ్యాపకుల ప్రతిభను వెలికి తీసే వాతావరణం కళాశాలలో ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే, నూతన సాంకేతిక పరిజ్ఞానాలను బోధనలో అనుసంధానం చేయడంలో మా సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన అన్నారు.డా. సి.హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, రామ కోటేశ్వరరావు కృషి ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ వి. హరి బాబు మాట్లాడుతూ, ఇలాంటి విజయాలు కళాశాల విద్యా వాతావరణాన్ని మరింత సమృద్ధిగా మార్చుతున్నాయని తెలిపారు. అధ్యాపకుల జ్ఞానాభివృద్ధి విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రిన్సిపల్ డా. సి.హెచ్. రవి కుమార్, వైస్ ప్రిన్సిపల్ వి. హరి బాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు రామ కోటేశ్వరరావుని అభినందిస్తూ, ఈ విజయంతో కళాశాల పేరు మరింత ప్రఖ్యాతి పొందిందని పేర్కొన్నారు.ఇలాంటి ప్రతిభావంతులైన అధ్యాపకుల సాధనలు విద్యా నాణ్యతను పెంపొందించడమే కాక, విద్యార్థుల్లో ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రేరణగా నిలుస్తున్నాయి.

## ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినికి గోల్డ్ మెడల్



**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ ఫిబ్రవరి 02**

ఒంగోలు బండ్లమిట్ట లో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని యశశ్విని సరస్వతి రాష్ట్ర స్థాయిలో స్పెల్ బీ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది. జనవరి 31న విజయవాడలోని మేరీస్ స్టెల్లా కాలేజీ విజయవాడలో స్కర్ట్ విభా వారి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి స్పెల్ బీ పోటీలలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల బండ్లమిట్ట ఒంగోలుకు చెందిన 10వ తరగతి విద్యార్థిని యశశ్విని సరస్వతిని మండల, జిల్లా, జోన్ లెవల్ లో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో సైతం ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.క్రిష్ణ కుమారి తెలిపారు. గైడ్ టీచర్ సి హెచ్.రమాదేవి (ఇంగ్లీష్), స్టాఫ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఎంసి చైర్మన్ జగదీష్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థినులు అన్ని రంగాలలో మండల , జిల్లా , రాష్ట్ర స్థాయిల్లో ముందుండే విధముగా ప్రోత్సహిస్తున్న ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థిని తండ్రియైన సి హెచ్. వెంకటేశ్వర్లు కుమార్తె ఇంతటి ప్రతిభ కనపరచడంలో ప్రోత్సహించిన ప్రధానో పాధ్యాయిని, ఇతర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మాజీ మంత్రి అంబటి రాంబాబు పై కొమరోలు పోలీసులకు ఫిర్యాదు

## కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి ఫిర్యాదు.

**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 2**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన తనయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో పాటు వారి కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషించి, వారి గౌరవానికి భంగం కలిగించడమే కాక వినరాని బూతులు తిట్టి వారిని అవమానించిన రాష్ట్ర మాజీ మంత్రి వైసిపి నేత అంబటి రాంబాబు పై కేసు నమోదు చేయాలని కోరుతూ కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలతో కలిసి సోమవారం కొమరోలు పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేశారు .తాను తెలుగుదేశం పార్టీ ఆశీస్సుల తో కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్ గా నియమించబడి పనిచేస్తున్నానని సంజీవరెడ్డి పేర్కొన్నారు. కాగా ఈనెల 1వ తేదీన రాష్ట్ర మాజీ మంత్రి ,వైసిపి నాయకులు అంబటి రాంబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో పాటు వారి కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషించి, వారి గౌరవానికి భంగం కలిగించారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాక ముఖ్యమంత్రిని , విద్యాశాఖ మంత్రిని ,వారి కుటుంబ సభ్యులను వినరా ని తీవ్ర పదజాలంతో దూషించి, మీ అంతు చూస్తానని అంబటి రాంబాబు తీవ్ర పదజాలంతో బెదిరించారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు .కావున రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, వారి కుటుంబ సభ్యులను దూషించి, అవమానించి, బెదిరించిన మాజీ మంత్రి అంబటి రాంబాబు పై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, సంజీవరెడ్డి




పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని కొమరోలు పోలీసులు సంజీవరెడ్డికి తెలిపారు. ఆ కార్యక్రమంలో కొమరోలు తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి, ఇడమకళ్ళు సహకార సంఘం చైర్ పర్సన్ బిజ్జం రవీంద్రారెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బిజ్జాల తిరుమలరెడ్డి, కొమరోలు సహకార సంఘం మాజీ అధ్యక్షులు పులకుర్తి వెంకటేశ్వర్లు, టిడిపి నేతలు పాలుగుళ్ల మల్లికార్జున్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి ,కనప శేఖర్ ,చికెన్ కొట్టు ఖాజావలి, నాయబ్ రసూల్, నరసింహులు, ఖాజావలి, అలాం, కొమరోలు వార్డు మెంబర్లు షేక్ సుభాని, షేక్ జమాల్, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కరీముల్లా, నాయబ్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన భాదితులకు న్యాయం

### మీ కోసం కార్యక్రమంకలో 43 ఫిర్యాదులు





**మార్కాపురం ఆర్ సి ఇన్చార్జి పెన్ పవర్ ఫిబ్రవరి 2**

ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కారించుటయే లక్ష్యంగా జిల్లా ఇన్చార్జ్ ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మార్కాపురం డి.ఎస్.పి యు.నాగరాజు, పోలీస్ అధికారులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదులను పోలీస్ అధికారులు స్వీకరించి వారితో మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకున్నారు. అందిన ప్రతి పిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వర పరిష్కారం కల్పిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. అదేవిధంగా అందిన ఫిర్యాదుల వివరాలను సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేసి, త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా భూ వివాదాలు, ఉద్యోగ మోసాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, చీటింగ్ కేసులు, ఇతర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. ప్రజల విశ్వాసం పెంపొందించడమే కాకుండా బాధితులకు తక్షణ సహాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం సిఐ సుబ్బారావు, పొదిలి సీఐ యం.రాజేష్ కుమార్, పామూరు సిఐ శ్రీనివాసరావు, గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# హాస్టల్ వెల్ఫేర్ అధికారి కె లక్ష్మానాయక్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం



**పెద్ద దోర్నాల, పెన్ పవర్ ఫిబ్రవరి 01**

పట్టణంలోని బిసి వెల్ఫేర్ వసతి గృహ సంక్షేమ అధికారి కే లక్ష్మా నాయక్ పదవీ విరమణ కార్యక్రమం స్థానిక బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపము నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి అధ్యక్షతగా ఎస్ వి కె పి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జి సి ధర్మానాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మానాయక్ సుమారు 39 సంవత్సరాల పాటు హాస్టల్ సంక్షేమ అధికారిగా విధులు నిర్వహించి రిటైర్ కావడం జరిగిందని తన సర్వీసులో ఎక్కడ ఏ విధమైనటువంటి రిమార్కులు లేకుండా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలు ప్రాంతాలలో విధులు నిర్వహించి పలువురిచే ప్రశంసలు అందుకున్నారని అదేవిధంగా పలువురు విద్యార్థులను తీర్చిదిద్ది ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడం ఆయనకు గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు. అదేవిధంగా పలు మండలాల విద్యాశాఖ అధికారులు మరియు లక్ష్మానాయక్ బందు మిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు అందజేయడం జరిగింది. ఈ సందర్భముగా సన్మాన గ్రహీత కే లక్ష్మానాయక్ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని అదేవిధంగా చిన్నతనం నుండి తన విద్యాభ్యాసంలో మరియు కుటుంబ పరిస్థితులలో కూడా ఒడిదుడుకులు ఎదుర్కొని వాటన్నింటినీ ఎదురొడ్డి కష్టపడటం వలన ఈరోజు ఇంతటి గౌరవం దక్కిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద దోర్నాల త్రిపురాంతకం పాములపాడు విద్య శాఖ అధికారులు మరియు దోర్నాల వైసీపీ కన్వీనర్ గంట వెంకట రమణారెడ్డి ఎర్రగొండపాలెం వైసిపి గ్రీవెన్స్ కన్వీనర్ వెన్నా వెంకటేశ్వర రెడ్డి చిట్టే వెంకటేశ్వర రెడ్డి టిడిపి నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు జి గాలే నాయక్ భూమని మంతన్నపలు గ్రామాల లక్ష్మి నాయక్ అభిమానులు శిష్యులు తోటి స్నేహితులు బంధుమిత్రులు భారీగా పాల్గొనడం జరిగింది.

# రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

## పోలీసులు, విద్యార్థులు, ప్రజలుతో అవగాహన ర్యాలీ







**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఫిబ్రవరి 2**

జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలు సందర్భంగా మార్కాపురం పట్టణంలో అధికారులు, పోలీసులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మార్కాపురం డిఎస్పీ యు.నాగరాజు జెండా ఊపీ ప్రారంభించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని నాలుగు ప్రధాన వీధుల గుండా సాగింది. ప్లకార్డులతో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలంటే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రహదారి నియమ నిబంధనలు పాటించాలని మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరాన్నితెలియచేసారు. హెల్మెట్ వినియోగం, సీట్బెల్ట్ తప్పనిసరి, మద్యం సేవించి వాహనాలు నడపొద్దు, అతివేగం నివారణ, ట్రాఫిక్ నిబంధనల పాటించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం ప్రాణాలకు ముప్పుగా మారుతుందని ఈ సందర్భంగా డీఎస్పీ నాగరాజు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చలానాలు విధించడమే కాకుండా, అవసరమైతే జైలుశిక్ష కూడా తప్పదన్నారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ పట్ల అవగాహన పెంచుకొవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ట్రాఫిక్ పట్ల ఎప్పుడూ ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉంటారో.. అప్పుడే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు సేఫ్టీ వారియర్స్ కూడా ఎర్పాటు చేయడం జరిగింది. ప్రజల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సీఐ సుబ్బారావు, టౌన్ ఎస్సై సైదు బాబు, అంకమ్మరావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో ఘనంగా కోదండ రామస్వామి వార్షికోత్సవ వేడుకలు



**పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 2**

పొదిలిలో కోదండ రామస్వామి 26వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా వార్షికోత్సవ నాలుగవ రోజు సోమవారం నాడు నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయ దాతలు పి నవీన్ కుమార్, భవ్య అక్షిత దంపతులను మేళతాళాలతో ఆలయానికి కమిటీ నిర్వాహకులు తీసుకుని వచ్చారు. అనంతరం ఉభయ దాతలు కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రోళ్ళా శ్రీను, సత్య నాగమణి దంపతులు, మాదాల వారి పాలెం సహకార సంఘం డైరెక్టర్ బత్తిన ఓబయ్య, తెలుగుదేశం నాయకులు వీరిశెట్టి సురేష్, ఓబుల శెట్టి సత్యనారాయణ, ఎస్ నాగేశ్వరరావు, ఆకుపాటి రవి, బులిరెడ్డి, బండి వెంకటేశ్వర్లు, బండి వెంకటరావు, రోడ్ల నరసింహ, ఎం వరదరాయుడు, అంకిత మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో ఘనంగా బిజెపి జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమం



**పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 2**

పొదిలిలో బిజెపి జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమం ఘనంగా జరిగింది. పట్టణంలోని బెల్లంకొండ నగర్ లో గల బిజెపి కార్యాలయంలో కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రదీప్, బాలయ్య లు బిజెపి పార్టీలో చేరారు. వారిని విజయలక్ష్మి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు స్వచ్ఛందంగా బిజెపిలోకి వస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

# "షి" చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ..

## చిత్ర బృందానికి అభినందనలు తెలిపిన టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 2**

గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి "షి" సినిమా ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్ను ఆదివారం రాత్రి లాంఛనంగా విడుదల చేసి, చిత్ర యూనిట్ను ప్రత్యేకంగా అభినందించారు. సునేష్ కొమ్మునూరి దర్శకత్వంలో డైరెక్టర్ ఆఫ్ ప్రొడ్యూసర్ - చిట్టెం క్రాంతి, సాహిత్యం - నందిని' ల సారథ్యంలో తెరకెక్కనున్న " షి " మూవీ ట్రైలర్ చాలా ఆసక్తికరంగా ఉందని, సినిమాటోగ్రఫీ, నిర్మాణ విలువలు బాగున్నాయని ప్రశంసించారు. వినూత్నమైన కథాంశంతో తెరకెక్కిన 'షి' చిత్రం విజయం సాధించాలని, చిన్న సినిమాలను, కొత్త ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, సినిమా కోసం చిత్ర యూనిట్ పడిన కష్టం ట్రైలర్లో కనిపిస్తోందన్నారు. ఈ సినిమా ద్వారా నటీనటులకు, సాంకేతిక నిపుణులకు మంచి పేరు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని, ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవాలని, నిర్మాతలకు లాభాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను" అని శుభాకాంక్షలు తెలియజేశారు. తమ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి విచ్చేసి, తమను ఆశీర్వదించినందుకు చిత్ర నిర్మాతలు, దర్శకుడు, చిత్ర యూనిట్ సభ్యులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు, నటినటులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, సినీ అభిమానులు పాల్గొన్నారు.

## అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడి నేల దినోత్సవం



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 2**

యర్రగొండపాలెం, గంజివారిపల్లి అటవీ రేంజ్ పరిదీలలో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎ, ప్రసన్న జ్యోతి పాల్గొని అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు ప్రకృతిని కాపాడే అడవులను, విలువైన వన్య ప్రాణులను సంరక్షించుటలో బాధ్యతతోఉండాలన్నారు. అడవిలో ఎవరైనా నిప్పు పెట్టిన, వన్యప్రాణులకు హాని కలిగించిన అటవీశాఖ అధికారులకు తెలుపాలన్నారు. కార్యక్రమంలొ ప్రధానోపాధ్యాయులుమహమ్మద్ ఖాసీం, ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, బాధరయ్య, అటవీశాఖ అధికారులు డి వై ఆర్ ఓ డి, శివశంకర్ నాయక్, మంగే నాయక్, బీట్ ఆఫీసర్లు షేక్ ఖాజా మొహిద్దీన్, నాసరయ్య, వెంకటయ్య, కళ్యాణి, ఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు. లిగంజివారిపల్లి అటవీశాఖ రేంజ్ లొ ఫారెస్ట్ రేంజ్ అధికారి వై, సూర్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం జడ్ పి హై స్కూల్ లొ మొక్కలు నాటి అవగాహనా కల్పించారు.అడవులు, వన్యాప్రాణుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలొ సెక్షన్ అధికారి యు, సి హెచ్, నారాయణ, బీట్ అధికారి ఎ, బానుప్రసాద్ పాల్గొన్నారు.

## మాజీ వైఎస్ఆర్సిపి మంత్రి అంబటి రాంబాబుపై ఫిర్యాదు



**అర్ధవీడు, పెన్ పవర్, ఫిబ్రవరి 2**

అర్ధవీడు మండలం టిడిపి పార్టీ అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులు గారి ఆధ్వర్యంలో, మాజీ వైఎస్ఆర్సిపి మంత్రి అంబటి రాంబాబు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గారిని మరియు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గారిని విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ అర్ధవీడు మండల టిడిపి నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు అర్ధవీడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ, ప్రజా నాయకులపై అవమానకరమైన మరియు ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని, రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేసే ఇటువంటి వ్యాఖ్యలపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి నాయకుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### శాంతి భద్రతలు క్షీణించాయి..

# రాష్ట్రపతి పాలన పెట్టండి

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే బూచేపల్లి డిమాండ్




**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 02**

రాష్ట్రంలో మూడు రోజుల నుండి వైస్సార్సీపీ నేతల మీద అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇండ్ల మీద దాడులు చేశారని ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకాశం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఒంగోలు వైసీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షిణించాయని రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ లో నెయ్యి కల్తీ జరిగిందని దుష్ప్రచారం చేస్తున్నారని, ఫ్లెక్సీ లు పెట్టి రెచ్చగొట్టెలా వ్యవహరిస్తున్నారని అన్నారు. వాటిని తొలగించమని విజ్ఞప్తి చేసిన దానికి ప్రతిగా టీడీపీ నేతలు కర్రలతో దాడులు చేస్తుంటే పోలీసులు చోద్యం చూశారన్నారు. క్షణికావేశంలో అంబటి రాంబాబు పరుష పదాలు వాడారని దానికి ఆయన క్షమాపణ కూడా చెప్పారని, అయినా వినకుండా అంబటి రాంబాబు మీద, ఆయన ఇంటి మీద దారుణంగా దాడి చేశారన్నారు.బాధ్యత గల ముఖ్యమంత్రి లా అండ్ ఆర్డర్ ని కాపాడాలి కానీ కార్యకర్తలు రెచ్చిపోతుంటే మౌనం పాటించడం దేనికి సంకేతమన్నారు. రౌడీ మూకలను ప్రోత్సహించడం సిగ్గు చేటన్నారు. దాడులు చేయడం కాదు ప్రజలకు మేలు చేయాలని హితవు పలికారు. తెదేపా నేతల దాడులకు , కేసులకు ఎవరూ భయపడరని చట్ట ప్రకారం ఎదుర్కుంటామని అన్నారు. ఒంగోలు తో పాటు పలుచోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ను ఎస్పీ జోక్యం చేసుకొని తొలగించాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ,పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు సమన్వయకర్త చుండూరి రవిబాబు,మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న,రాష్ట్ర కార్యదర్శులు రమణ రెడ్డి, వెంకటేశ్వర రావు,కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## బిసివై పార్టీ జిల్లా కన్వీనర్గా నరేంద్రబాబు నియామకం



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 2**

మార్కాపురం జిల్లాకు బిసివై పార్టీ కన్వీనర్గా సిరిమామిళ్ల నరేంద్రబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ చేపట్టిన ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొని, క్షేత్రస్థాయిలో పోరాటాలు నిర్వహించినందుకు గుర్తింపుగా ఈ అవకాశం కల్పించారని పేర్కొన్నారు.తాను జిల్లావ్యాప్తంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని నరేంద్రబాబు స్పష్టం చేశారు. నరేంద్రబాబు నియామకంపై పార్టీ నాయకులు, యువకులు హర్షం వ్యక్తం చేశారు.

## నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ.3,00,912/-

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 2**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామికి ఆదివారం ఆదాయం 3 లక్షల 912 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు. దర్శన టికెట్లు అమ్మకం ద్వారా జమ రూ.58,270/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా జమ రూ.23,340/- లు, శాశ్వత అన్నదాన పథకమునకు విరాళంలో 25.138/- లు స్వామి వారి పంచామృత అభిషేకం నకు విరాళములు రూ.16.548/- లు, ఉచిత ప్రసాదమునకు విరాళములు రూ. 2,500 రూపాయలు , పొన్నలూరు మండలం పైరెడ్డిపాలెం గ్రామమునకు చెందిన కొండా మాలకొండారెడ్డి రమణమ్మ దంపతుల కుమారులు నారాయణరెడ్డి అశ్విని దంపతులు, చిన్న నారాయణరెడ్డి మహ ప్రాకార నిర్మాణమునకు 1 లక్ష 75 వేల 116 రూపాయలు విరాళం ను అందజేసినట్లు తెలిపారు.



## దేవస్థానానికి వెళ్లే మార్గంలో సింహద్వారం నిర్మించేందుకు చర్యలు

### ఆలయ కార్య నిర్వహణ అధికారి గిరిరాజు నరసింహ బాబు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 2**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానానికి వెళ్లే మార్గంలో సింహద్వారం నిర్మాణానికి కనిగిరి శాసనసభ్యులు, ప్రకాశం జిల్లా టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచనల మేరకు పామూరు--సి ఎస్ పురం నేషనల్ హైవే మార్గం నుండి దేవస్థానానికి వెళ్లే దారిలో సింహద్వారం నిర్మించేందుకు ప్లాన్లు ఎస్టిమేషన్లు సిద్ధం చేసినట్లు నారాయణస్వామి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా నకిరికల్ గ్రామానికి చెందిన వేమవరపు వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు వేమవరపు నరసింహులు సొంత నిధులతో సింహద్వారం నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. దాతృత్వంతో ముందుకొచ్చిన వేమవరపు నరసింహులు సేవాభావాన్ని అభినందిస్తూ ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు దాత వేమవరపు నరసింహులు ను స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. సింహద్వారం నిర్మాణంతో దేవస్థానానికి మరింత శోభచేకూరడంతో పాటు భక్తులకు సులభమైన మార్గదర్శకత కలగనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## జాయింట్ కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ కమిషనర్ రమణ బాబు

**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 2**

మార్కాపురం జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ను గిద్దలూరు మున్సిపాలిటి కమీషనర్ ఈ వి రామనబాబు సోమవారం నాడు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా గిద్దలూరు మున్సి పాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పై వివరించారు.



# తాత్కాలిక ప్రయోజనాల కోసం ఓటేస్తే రాష్ట్రానికి నష్టం

## సంక్షేమంలో కూటమి ప్రభుత్వం ముందంజ - మంత్రి గొట్టిపాటి రవికుమార్







**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 2:**
ఓటు అనేది రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఆయుధమని, కేవలం తాత్కాలిక ప్రయోజనాల కోసం ఓటు వేస్తే రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లుతుందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ స్పష్టం చేశారు. సోమవారం పర్చూరు నియోజకవర్గంలో ఆయన విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా యుద్ధనపూడి మండలం, యనమదలలో రూ.4.65 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్ను మంత్రి ప్రారంభించారు. అదే గ్రామంలో రూ.65 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించడంతో పాటు.. రూ.1.40 కోట్లతో నిర్మాణం చేపట్టనున్న బల్లికురవ - పోలూరు రోడ్డుకు, రూ.62 లక్షలతో నిర్మించే సైడ్ డ్రైన్లు, సీసీ రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.6 కోట్లతో ఎన్.హెచ్ 16 ఇసుక దర్శిని నుంచి వలపర్ల ఎంఎస్ఎంఈ ఎస్.ఈ.జెడ్ వరకు తారు రోడ్డు నిర్మాణానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు.

**విద్యుత్ ఛార్జీలు పెంచకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యం**

సభలో మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. లో ఓల్టేజ్ సమస్యలు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేయకుండా, ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలపై రూ.30 వేల కోట్ల భారం మోపారని ధ్వజమెత్తారు. ధ్వంసమైన విద్యుత్ వ్యవస్థను ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నామని, కష్టసాధ్యమైనా సరే యూనిట్కు రూ.1.19 వరకు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. "ఒక్క ఛాన్స్" అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ను సర్వనాశనం చేశారని మంత్రి విమర్శించారు. రాజధాని ఏది అంటే చెప్పుకోవడానికి కూడా ఏమీ లేని పరిస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 70 శాతం పూర్తయిన పోలవరాన్ని గత ప్రభుత్వం పూర్తి చేసి ఉంటే, రాష్ట్రానికి అదనంగా వెయ్యి మెగావాట్ల విద్యుత్ లభించేదని గుర్తు చేశారు. పేదలకు ఇచ్చే సామాజిక పెన్షన్ను రూ.1000 పెంచడానికి జగన్కు ఐదేళ్లు పట్టిందని, కానీ కూటమి ప్రభుత్వం రాగానే 63 లక్షల మందికి రూ.33 వేల కోట్ల పెన్షన్లను అందిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు పలువురు కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేక మూల మంత్ర హోమం





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఫిబ్రవరి 2**
స్థానిక షిర్డీ సాయి బాబా మందిరంలో చంద్ర మౌళిశ్వర స్వామి వారికి సోమవారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దీక్ష హోమము, మూల మంత్ర చండి హోమం భక్తిశ్రద్ధలలో వైభవంగా జరిగింది. మహిళా భక్తులతో సామూహిక కుంకుమ అర్చన పూజ కార్యక్రమాలు మైలటూరి రవిశంకర శర్మ, రంగనాధ శర్మ బృందం వారు నిర్వహించారు. బుధవారం ఏకాదశ రుద్రాభిషేకం, మహా కుంభాభిషేకం, హోమం పూర్ణహుతి, శివ పార్వతులు శాంతి కళ్యాణం జరుగుతాయని, సాయంత్రం 6 గంటలకు మాడ వీధులలో స్వామి వారి ఊరేగింపు నిర్వహించనునట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని మందిరం కార్యదర్శి గోపాలుని హరిహర రావు, కార్యనిర్వాహకురాలు వై.ధన లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో మందిరం అధ్యక్షులు పేరం సత్య నారాయణ, కోశాధికారి పి ఎల్ ఎన్ వి నాగరాజు, కమిటీ సభ్యులు గోపి శెట్టి కొండయ్య, సాయిబాబా,విజయ్, కృష్ణ మోహన్, మహిళా సంఘ సభ్యులు మందిరం మేనేజర్ సతీష్ నాయుడు పాలుగున్నారు.


# చర్చి పాస్టర్కు 15000 రూపాయలు స్వీకర్లకు పంపిణీ



**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఫిబ్రవరి 2**
మండల కేంద్రంలోని పాస్టర్ డి యోబు హల్లెలూయ ప్రార్థన మందిరం గిరిజన స్టోర్ రూమ్ వీధి 9వ లైన్ 15 వేల రూపాయలు స్వీకర్ల ను షేక్ షేక్షావలి పంపిణీ చేయడం జరిగింది.షేక్ షేక్షావలి సాలవతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ లు షేక్ మౌలాలి షేక్ సర్దార్ షేక్ మున్నా షేక్ షాందు దాసు షేక్ అబ్దుల్లా గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు 14 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొమరోలు సబ్స్టేషన్ పరిధిలోని చింతలపల్లి ఫీడర్ లోని 8 గ్రామాలకు, తాటిచెర్ల మోటు సబ్ స్టేషన్ పరిధిలో గల నాగిరెడ్డిపల్లి ఫీడర్లోని 6 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత.**



**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 2**
కొమరోలు మండలం లోని 14 గ్రామాలకు ఈ నెల మూడవ తేదీ మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఎం శ్రీనివాసులు తెలిపారు. కొమరోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల చింతల పల్లె ఫీడర్ లోని హనుమంతరాయుని పల్లె, కసినేపల్లె, గోహరపల్లి, కొత్తపల్లి ,వర్ధన పల్లి, ఓబులాపురం, కూరాకువానిపల్లి ,చింతలపల్లి గ్రామాలకు ఈనెల మూడవ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా ఆయన తెలిపారు .అలాగే తాటిచెర్ల సబ్ స్టేషన్ పరిధిలోగల నాగిరెడ్డిపల్లి ఫీడర్ లోని నాగిరెడ్డిపల్లి, దద్దవాడ ,గుండ్రెడ్డిపల్లి, అలసందలపల్లి ,నారాయణ పల్లి ,వెంకటాం పల్లి, గ్రామాలకు ఈనెల 3 వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరానున్నట్లుగా ఆయన తెలిపారు. కొమరోలు మండలంలో ఆర్ డి ఎస్ ఎస్ పథకము ద్వారా అమలు జరుగుతున్న కొత్త లైన్ల ఏర్పాటులో భాగంగా సదరు 14గ్రామాలలో ఈనెల 3వ తేదీ మంగళవారం కొత్త లైన్లను ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకున్నామని, ఆ కారణంగా ఆ గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయవలసి వస్తున్నదని ,కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఏఈ శ్రీనివాసులు కోరారు.

# సీఎం చంద్రబాబు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు పై గిద్దలూరు నియోజకవర్గంలో ఫిర్యాదుల వెల్లువ..




**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 2**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్ర నారా చంద్రబాబు నాయుడు పట్ల వైకాపా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు చేసిన అసభ్యకర, వ్యక్తిగత విమర్శలను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గిద్దలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అంబటి రాంబాబు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మార్గదర్శకత్వంలో మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఎక్కడా సంయమనం కోల్పోకుండా, చట్టం పై గౌరవంతో శాంతియుత వాతావరణంలో ఫిర్యాదులు అందచేశారు. గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు, కంభం, బెస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, గిద్దలూరు పోలీస్ స్టేషన్లలో లిఖితపూర్వక ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ, అంబటి రాంబాబు తీరు పై నిప్పులు చెరిగారు. వ్యక్తిగత దూషణలు తగవని, ప్రజాస్వామ్యంలో విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలి కానీ, పదే పదే వ్యక్తిగత దూషణలకు దిగడం అంబటి రాంబాబు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. గత ఎన్నికల్లోనే ప్రజలు వైకాపాకు తగిన గుణపాఠం చెప్పారని, ఇంకా ఇటువంటి వ్యాఖ్యలు కొనసాగిస్తే ఆ పార్టీకి రాష్ట్రంలో ఉనికి కూడా ఉండదని హెచ్చరించారు. "ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తిని, కోట్లాది మంది ఆరాధ్య దైవమైన చంద్రబాబు ను దూషించడం అంటే ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని, అంబటి రాంబాబు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి పై బురద జల్లడం మానుకోవాలని, లేనిపక్షంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి గురికాక తప్పదని గిద్దలూరు టీడీపీ నాయకులు హెచ్చరించారు.

# ప్రజలు నేరాలకు దూరంగా ఉండాలి -ఎస్సై సంపత్ కుమార్

**పుల్లల చెరువు పెన్ పవర్ ఫిబ్రవరి 2**
పుల్లల చెరువు మండల కేంద్రంలో నూతన క్రిమినల్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఎస్సై సంపత్ కుమార్ నిర్వహించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక భద్రతా సంహిత, భారతీయ సాక్ష్య సంహిత వంటి నూతన చట్టాలపై ప్రజలు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్సై సంపత్ కుమార్ మాట్లాడుతూ పాత బ్రిటిష్ కాలం నాటి క్రిమినల్ చట్టాలకు బదులుగా నూతన చట్టాలు అమల్లోకి వచ్చాయని, ఇవి నేరాలను నిరోధించడంలో, బాధితులకు త్వరిత న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు, బలహీన వర్గాల రక్షణకు నూతన చట్టాల్లో కఠిన నిబంధనలు తీసుకువచ్చినట్లు వివరించారు.నూతన చట్టాల్లో సాంకేతికతకు పెద్దపీట వేశారని, డిజిటల్ సాక్ష్యాలు, వీడియో రికార్డింగ్, ఆన్లైన్ ఫిర్యాదులు వంటి విధానాలతో పోలీస్ వ్యవస్థ మరింత పారదర్శకంగా మారిందని చెప్పారు. ఇకపై కేసుల విచారణ వేగంగా




పూర్తయ్యేలా సమయపరిమితులు విధించడంతో న్యాయ ప్రక్రియ మరింత సమర్థవంతంగా మారుతుందని తెలిపారు.ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండి, నేరాలకు దూరంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని ఎస్సై సూచించారు. పోలీస్ శాఖ ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, చట్టం అందరికీ సమానమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు,యువత పాల్గొన్నారు.

# రామాయపాలెంలో యూఎఫ్ఎస్ సర్వేను పరిశీలించిన ఎంపీడీవో

## పారదర్శకంగా సర్వే నిర్వహించాలి ఆదేశాలు జారీ



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 2:**
అద్దంకి మండలం, రామాయపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న యూఎఫ్ఎస్ సర్వే, ఇంటి పన్ను వసూళ్ల ప్రక్రియను సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరూధిని, డిప్యూటీ ఎంపీడీవో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును దగ్గరుండి పర్యవేక్షించిన అధికారులు, రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాల్లోని ఆస్తుల గుర్తింపు, ఇంటి పన్ను వసూళ్ల విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను నమోదు చేయాలని, పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వహించకూడదని సిబ్బందికి స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ఆదాయాభివృద్ధికి ఇంటి పన్ను వసూళ్లు కీలకమని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సర్వేలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సర్వే సిబ్బంది, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పాకలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించాలి

## - రాష్ట్ర మ్యారీటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 02**
మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 14, 15 తేదీలలో పాకలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ప్రభుత్వం తరఫున అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మ్యారీటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ కోరారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును సోమవారం ప్రకాశం భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం జాయింట్ కలెక్టరు కల్పనా కుమారిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

# జిల్లా అభివృద్ధి పథంలో ప్రకాశించాలి

## - ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి ఆకాంక్ష




**కలెక్టరేట్ ఒంగోలు,పెన్ పవర్ ఫిబ్రవరి 02**
విద్య వైద్య వ్యవసాయ పారిశ్రామిక అన్ని రంగాల్లో ప్రకాశం జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆకాంక్షించారు. ఒంగోలులోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో 57వ ప్రకాశం జిల్లా అవతరణ దినోత్సవ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లా ఏర్పాటుకు నిర్ణయం జరిగిందని జిల్లా పేరును స్వాతంత్ర్య సమరయోధులు ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు పేరును సూచించి ప్రకాశం జిల్లాగా నామకరణం చేయడం జరిగిందని శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ప్రజలకు 57వ జిల్లా ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చుండూరు రవిబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కసుకుర్తి ఆదెన్న, ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న అన్నా మిత్రమండలి

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఫిబ్రవరి 2**
పట్టణంలోని 17వ బ్లాక్ కు చెందిన ఆటో డ్రైవర్ లేట్ షేక్ నిజాం కుమారుడు షేక్ ఖాసీం వలీ అనే బాలుడు ఇటీవల విద్యుత్ షాక్ కు గురయ్యాడు. సోమవారం మాజీ శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ అన్నా రాంబాబు ఆదేశాల మేరకు పట్టణంలోని కరెంట్ ఆఫీస్ వెనుక కరెంటు షాక్ తగిలిన షేక్ నిజాముద్దీన్ కుమారుడు షేక్ ఖాసీం వలి కుటుంబానికి 1,20,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అన్నా మిత్రమండలి సభ్యులు అందజేశారు. గుంటూరు హాస్పిటల్ లో చికిత్సా చేయించుకుంటున్న షేక్ ఖాసీం వలి ని కలిసి వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. చికిత్సా గురించి డాక్టర్ తో చర్చించి బాధిత కుటుంబానికి 1,20,000వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. గుంటూరుకు వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాన్ని కలిసిన వారిలో అన్నా మిత్రమండలి సభ్యులు మైనార్టీ నాయకులు వార్డెన్ నజీర్ , షేక్ ఖాసిం వలి, 18 బ్లాక్ ఇన్చార్జి సయ్యద్ గఫూర్ మార్కాపురం వైస్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ బాషా, సీఎం ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



# తడి పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించండి

## - మునిసిపల్ కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావు






**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 02**

చెత్త ఇచ్చేటప్పుడు దానిని తప్పనిసరిగా పొడి చెత్త, తడి చెత్తగా వేరు చేసి ఇచ్చే విధంగా ప్రజలలో అవగాహన కల్పించాలని స్వచ్ఛ మిత్రలకు

ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం ఐటిసి వారి సహకారం తో నిర్వహిస్తున్నా వావ్ ( వెల్ బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్) కార్యక్రమ స్వచ్ఛ మిత్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ, ఒంగోలు నగరంలో సానిటేషన్ పనుల పురోగతి మెరుగుపర్చుకోవటం కోసం స్వచ్ఛ మిత్రలను ఏర్పాటు చేయడం జరిగినదని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్క స్వచ్ఛ మిత్ర వారికి కేటాయించిన వార్డ్ లలో ప్రతి ఇంటి నుంచి కూడా ప్రతి రోజు చెత్త సేకరణ జరుగుతున్నదో లేదో తెలుసుకొని , ఎక్కడ అయినా జరగని ఎడల వెంటనే మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ లేదా ఎగ్జిక్యూటివ్ అథారిటీ వారికి తెలియపరచాలని సూచించారు. ప్రజలు అందరూ కూడా ప్రతివారంలో 5 రోజులు తడిచెత్తను, రెండు రోజులు ( బుధవారం మరియు ఆదివారం) మాత్రమే పొడి చెత్తను సేకరిస్తామని స్వచ్ఛ మిత్రలు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రతి స్వచ్ఛ మిత్ర కూడా వారికి కేటాయించిన వార్డ్ యొక్క సానిటేషన్ సెక్రటరీ, శానిటరీ సూపర్వైజర్ ల సహకారం తీసుకొని ఆయా వార్డులలో తప్పనిసరిగా సానిటేషన్ పనులు జరిగేలా చూడాలని సూచించారు. విధులలో ఏదైనా ఇబ్బంది ఉన్నట్లు అయితే డైరెక్ట్ గా ఎగ్జిక్యూటివ్ అథారిటీ దృష్టికి తీసుకురావాల్సిందిగా తెలిపారు. ఈ సమావేశం లో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, ఐటీసి ప్రతినిధి సునీల్ కుమార్, సానిటరీ సూపర్వైజర్ నూకతోటి పిచ్చయ్య, స్వచ్ఛ మిత్ర కోఆర్డినేటర్స్, 50 మంది స్వచ్ఛ మిత్రలు పాల్గొన్నారు.

# అని వేటి మండప నిర్మాణానికి విరాళం



**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 2**

కందుకూరు గ్రామ దేవత శ్రీ అంకమ్మ తల్లి దేవాలయ అనేవేటి మండప నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ అనివేటి మండపం నిర్మాణానికి దాతలు సహకరిస్తూనే ఉన్నారు. దీనిలో భాగంగా సోమవారం శెట్టి చిన్న కొండయ్య ధర్మపత్ని కొండమ్మ జ్ఞాపకార్థం మనవళ్ళు శ్రీకాంత్, భరత్, వంశీ 25,116 రూపాయలు అనివేటి మండప నిర్మాణానికి ఆన్లైన్ ద్వారా అందజేసినట్లు శ్రీ అంకమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు మంచిరాజు వెంకట మురళీమోహన్ తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి వారి కుటుంబం పై అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

# జిల్లా కలెక్టర్ ను కలిసిన మోషే

**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 2**

ప్రకాశం జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో ప్రకాశం జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ పి రాజాబాబు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించిన నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు వలపర్ల సుబ్బారావు , కొండేపి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు కొమ్ము చిట్టిబాబు , వితలాపురం మాజీ సర్పంచ్ పాలిపోగు సాల్మన్ రాజు , బిజెపి ఎస్సీ మోర్చా ప్రకాశం జిల్లా అధ్యక్షులు పెరికె లక్ష్మణ్ , బిజెపి ఎస్టీ మోర్చా ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్షులు జగన్నాథం వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.. ఎస్సై శివ నాంచారయ్య

**అర్ధవీడు, పెన్ పవర్, ఫిబ్రవరి 2**

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అర్ధవీడు ఎస్ఐ ఎం శివ నాంచారయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రమైన అర్ధవీడు డ్వాక్రా సంఘం మహిళా సమైక్య కార్యాలయం నందు డ్వాక్రా సంఘ మహిళలకు, విఓఏ లకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎం. శివ నాంచారయ్య మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న నేరాల నేపథ్యంలో చట్టాలపై అవగాహన చాలా అవసరమని తెలిపారు. సైబర్ క్రైమ్ చట్టాల గురించి మహిళలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఆన్లైన్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మానభంగం కేసులపై చట్టపరమైన రక్షణ చర్యలను వివరించారు. హత్యాచారాలకు సంబంధించిన చట్టాలు ఎంత కఠినంగా ఉన్నాయో తెలియజేశారు. చిన్న పిల్లలపై జరిగే అఘాయిత్యాల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. పిల్లల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఇలాంటి ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏపిఎం రమేష్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలు నేరమని స్పష్టం చేశారు. అవి




పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తాయని అన్నారు. బాల్య వివాహాలపై ఉన్న చట్టాలను సభ్యులకు వివరించారు. తల్లిదండ్రులు ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడాలని తెలిపారు. చట్టాలపై అవగాహన ఉంటే నేరాలను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సిసి శారద, అకౌంటెంట్ శ్రీదేవి , వివోఏలు, డ్వాక్రా సంఘం లీడర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి

## పంచాయతీ కార్యదర్శికి సమ్మె నోటీసు ఇస్తున్న సిఐటియు కార్యదర్శి చిరుపల్లి అంజయ్య



**దొనకొండ ఫిబ్రవరి 2 పెన్ పవర్ :**

స్థానిక మండలంలోని దొనకొండ మండల సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 12 -2-2026 తేదీన దేశవ్యాప్తంగా జరుగు సమ్మెలో భాగంగా సోమవారం దొనకొండ గ్రామ మేజర్ పంచాయతీ ఆఫీస్ నందు పంచాయతీ కార్మికులు సమ్మె నోటీసు కార్యదర్శి పొట్ల. కృష్ణమూర్తి కి ఇవ్వటం జరిగింది. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు 12-02- 26వ తేదీ జరుగుతున్న దేశ వ్యాప్తి సమ్మెలో 132 ,142, 680 జీవోలు అమలుతో పాటు టెండర్లపై హైకోర్టు తీర్పులు అమలు కోసం పంచాయతీ కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక సంస్కరణ పేరుతో తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ తేదీ 21 -11- 2025వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలు చేయటానికి ఉత్తర్వులు జారీ చేసింది. కార్మికుల ప్రయోజనాలకు ఈ లేబర్ కోడ్స్ విఘాతం కలిగించి పెట్టుబడుదారులు, కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చుతాయి యూనియన్ పెట్టుకునే హక్కును ,సమ్మె హక్కును నిరాకరిస్తున్నాయి. పని గంటల పెంపు, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తున్నాయి. కోట్లాదిమంది కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ కు కూటమి ప్రభుత్వం బలపరుస్తుంది. గ్రామపంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, ఎన్. ఎం. ఆర్ లకు నెలలు తరబడి జీతాలు బకాయిలు ఉన్నాయి. గత 8 ఏళ్లుగా జీతాలు పెరగకపోవడం, నిత్యం పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలు, చాలీచాలని జీతాలతో కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో తేదీ 12-02-20 26వ తేదీ లేబర్ కోట్స్ రద్దు కోసం సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న దేశ వ్యాప్త ఒకరోజు సమ్మెలో, గ్రామపంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, ఎన్.ఎం.ఆర్ కార్మికులకు జీతాల పెంపులపై , టెండర్లపై హైకోర్టు తీర్పు అమలు, 132, 142, 680 ,జీవోల అమలు తదితర డిమాండ్లు పరిష్కారానికిసమ్మెలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో దొనకొండ మండల సి.ఐ.టి . యు.కన్వీనర్ చిరుపల్లి అంజయ్య, గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షులు బిందెల చిన్న బాలకోటయ్య, ఉపాధ్యక్షులు లోకయ్య, దాసు, మేరీ, యోహాను, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# లడ్డుపై ఆధారరహిత ఆరోపణలు మానుకోండి

## పోలీస్ స్టేషన్‌లో అన్నా, జంకె, వెన్నా పిర్యాదు

**మార్కాపురం ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 2**

పవిత్రమైన తిరుమల లడ్డుపై అనేక అనుమానాలు, ఆధారరహిత ఆరోపణలు అన్నీ అసత్యమని సి.బి.ఐ రిపోర్టు ఇచ్చినప్పటికీ ఇంకా కొంతమంది తప్పుడు ప్రచారాలు చేస్తున్న నేపథ్యంలో వారి మీద చర్యలు తీసుకోవాలని మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, వైయస్సార్ సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్న హనుమారెడ్డి, వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై సైదుబాబుని కలిసి ఫిర్యాదు చేశారు. ముందుగా స్థానిక శ్రీ లక్ష్మి పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా, దురుద్దేశంతో, కుట్రలకు పాల్పడుతున్నా వారిని గుర్తించి, చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు





కలిసిందని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలను దెబ్బతీశారాని,లడ్డూ వ్యవహారంలో జగన్ మోహన్ రెడ్డి మీద నిందలు వేసే ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. సిబిఐ, సిట్ విచారణలో నిజా నిజాలు బయటకువచ్చాయనీ, జంతువుల కొవ్వు కలవలేదని నిర్ధారణ అయ్యిందన్నారు.వారు చేసిన వ్యాఖ్యలు నిరాధారం అని ఆధారాలతో సహా నిరూపితమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సి మెంబర్ కోటిరెడ్డి వైసీపీ పట్టణ అధ్యక్షులు సలీం, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్నయ్య స్వామికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 2**

అనుముల పల్లె శ్రీ జీవన మూర్తి స్వామివారి ప్రథమ శిష్యులు శ్రీ చిన్నయ్య స్వామి జెండా మహోత్సవం రాచర్ల మండలం ఆకవీడు లో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవంలో గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని శ్రీ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామసులు, మహోత్సవ నిర్వాహకులు ఎమ్మెల్లే కు ఆలయమార్యదలతో ఘన స్వాగతం పలికారు. అర్చకులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదల నొసంగి , వేదాశీస్సులు అందజేశారు. గ్రామంలో ఈమహోత్సవం సందర్భంగా కోలాటం , కులుకు భజన, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కాకుండా రాష్ట్ర స్థాయిలో ఎడ్లు బండ లాగుడు పోటీలను ఏర్పాటుచేశారు. ఈపోటీలు ఉత్కంటభరితంగా సాగాయి. వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకొని మ్రొక్కులు చెల్లించుకున్నారు.

# టాలెంట్ టెస్ట్‌లో సి ఎస్ పురం విద్యార్థినీ బండి పుష్ప ప్రతిభ

## అభినందించిన ఉపాధ్యాయులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 2**

మండల కేంద్రం లోని సి.ఎస్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని బండి పుష్ప ప్రతిభతో పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చింది. రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కంచర్లవారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కనిగిరి నియోజకవర్గ స్థాయి టాలెంట్ టెస్ట్ లో మండల స్థాయిలో మూడవ బహుమతి సాధించింది. అలాగే శ్యామల వెంకట రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి టాలెంట్ టెస్ట్ లో మండల స్థాయిలో రెండవ ర్యాంకు సాధించి అందరి ప్రశంసలు పొందింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసాబేగం మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని బండి పుష్పను ఘనంగా అభినందించారు. ఆమెకు గిఫ్ట్ బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసాబేగం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు లక్ష్యసాధనపై దృష్టి సారిస్తే ఇలాంటి విజయాలు సాధించడం సాధ్యమని అన్నారు. బండి పుష్ప విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాబోయే పబ్లిక్ పరీక్షలలో ఇంకా మంచి మార్కులతో ఉత్తీర్ణతతో రాణించి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహా పాపం నిజం ఫ్లెక్సీలు తొలగించాలి

## - ఒంగోలు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త చుండూరి రవిబాబు

క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 02

తిరుమల లడ్డు కల్తీ అంటూ మహా పాపం నిజం పేరుతో ఒంగోలు నందు ఏర్పాటు చెందిన ఫ్లెక్సీలను తొలగించి, నగర పాలక సంస్థ అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు సమన్వయకర్త చుండూరి రవిబాబు ఆధ్వర్యంలో ఒంగోలు ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ నందు పిర్యాదు చేశారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఫ్లెక్సీలను వేసిన వారిపైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నియమించిన దర్యాప్తు సంస్థలు లడ్డులో కల్తీ జరగలేదు అంటూ నివేదిక ఇచ్చినా కూడా తప్పుడు ఆరోపణలు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు అని అన్నారు. కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారంతో పని చేస్తుందని ఆరోపించారు.అనంతరం మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ను కలిశారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని వైసీపీ నాయకులు కోరారు. ఫ్లెక్సీలను తొలగించని నేపద్యంలో తామే వాటిని తొలగిస్తామని అన్నారు. ఉన్నత అధికారులతో చర్చించి వాటిని తొలగిస్తామని కమీషనర్ తెలిపారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇమ్రాన్ ఖాన్, వెంకటేశ్వర రావు,లీగల్ సెల్ అధ్యక్షులు నగిరికంటి శ్రీనివాసరావు, హరిబాబు, రవణమ్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



# ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం ప్రజాస్వామ్యమా?

**వైఎస్సార్ సిపి నేత కుంచే రమణారావు.**



**అమలాపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 2**

ప్రభుత్వం చేస్తున్న కప్పులను ప్రశ్నించే వారిపై దాడులు చేయడం ప్రజాస్వామ్యం అవుతుందా అని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైఎస్సార్ సిపి నేత కుంచే రమణారావు ప్రశ్నించారు. సోమవారం అమలాపురంలోని విలేకరులకు రమణారావు పత్రికా ప్రకటన విడుదల చేశారు.ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రులు అంబటి రాంబాబు,జోగి రమేష్ లపై టిడిపి గూండాలు కార్యకర్తలు దాడి చేయడం ఇళ్లకు నిప్పు పెట్టడం అత్యంత హేయమైన చర్య అని దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రమణారావు తెలిపారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీస్తే సమాధానం చెప్పలేక గుండాలతో దాడులు చేయిస్తున్నారని అంబటి,జోగి రమేష్ లపై దాడులు చేయడం ప్రజాస్వామి కమన్నారు.రాష్ట్రంలో రాజ్యాంగానికి విరుద్ధంగా రెడ్ బుక్ పాలన సాగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని పాలన మన రాష్ట్రంలోనే జరుగుతుందన్నారు.నాలుగు సార్లు సీఎం అని చెప్పుకునే చంద్రబాబు పాలన ఇదేనా అని ప్రశ్నించారు.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజు నుంచి రాష్ట్రంలో అధికార పార్టీ ఆగడాలు పెరిగిపోతున్నాయని అన్నారు.గట్టిగా ప్రశ్నించే వారిని భయభ్రాంతులకు గురిచేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గమనించి పాలన సాగించాలని రమణారావు హితవు పలికారు. తిరుమలలో లడ్డూ పై అసత్య ప్రచారాలు చేసి లడ్డు లో పంది కొవ్వు చేప నూనె కలిసింది అంటూ తిరుమల ఖ్యాతిని దెబ్బతీసిన చంద్రబాబుకు అటువంటిదేమీ లేదని సిట్ తేల్చడంతో ఆయన డైవర్షన్ పాలిటిక్స్ ప్రారంభించారని రమణారావు అన్నారు.

## సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు -డీఎస్పీ రఘువీర్



**రామచంద్రపురం పెన్ పవర్, ఫిబ్రవరి 2**

సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు ఫిబ్రవరి 02-2026 నుండి ఫిబ్రవరి 28-2026 వరకు రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి 1)రామచంద్రపురం, 2)ద్రాక్షారామ, 3)పామర్రు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి ప్రాంతాలకు ఇది వర్తిస్తుందని తెలిపారు. వీటి ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదు. అటువంటివి జరపడానికి రామచంద్రపురం పోలీసు సబ్ డివిజన్ ఎస్డిపిఓ వద్ద ముందుగా అనుమతి పొందవలసి ఉంటుంది. ఈ విషయాన్ని అందరూ గమనించి, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు ఎప్పటిలాగే అందరూ సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పీలేరులో డి.ఎస్.పి కార్యాలయం ఏర్పాటుపై జిల్లా ఎస్పీ కివినతి




**మదనపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 2**

పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి ప్రతినిధుల ఆధ్వర్యంలో నేడు మదనపల్లి కేంద్రంగా జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ కొనుబిల్లి ధీరజ్,అదేవిధంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,లకు పీలేరు నందు డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు మాట్లాడుతూ పీలేరు రెవెన్యూ డివిజన్ గా ఏర్పడి నెల పూర్తి కావస్తున్న ఒక ఆర్డి.ఓ. కార్యాలయం ఏర్పాటు తప్ప ఇంతవరకు డిఎస్పి కార్యాలయం ఏర్పాటు కాలేదని అదేవిధంగా డివిజన్ పరిధిలో ఏర్పాటు చేయవలసిన పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాల కూడా ఏర్పాటుకు నోచుకోలేదని పీలేరు మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పలు సమస్యలపై అధికారులను కలవాలంటే పీలేరు నుండి రాయచోటి దాదాపు 60 కిలోమీటర్ల ప్రయాణం చేయాలి ఈ నేపథ్యంలో డివిజన్ పరిధిలో పలు ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడంతో ప్రజలు వ్యప్రయాసలకు గురై కార్యాలయాలకు వెళ్ళవలసిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి కావున ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి పీలేరులో డిఎస్పి కార్యాలయం అదేవిధంగా డివిజన్ పరిధిలో ఏర్పాటు చేయవలసిన పలు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు పై తక్షణమే స్పందించాలని వీరు కోరారు.వినతి పత్రం సమర్పించిన వారు పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి ప్రతినిధులు నడిమి కంద్రిక సుధాకర్ బాబు, పాలకుంట శ్రీనివాసులు, తుమ్మల ధరణి కుమార్, ముల్లంగి చంద్రయ్య, జెట్టి మల్లికార్జున దుబ్బా శ్రీకాంత్, బద్దె భాను ప్రకాష్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- -జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు -నేరాల కట్టడి, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి
- -మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల కట్టడికి ప్రతి ఒక్క పోలీస్ అధికారి కృషి చేయాలి
- -సాంకేతిక టెక్నాలజీ పై అవగాహన పెంచుకుంటూ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి
- -అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలి
- -ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదారులకు భరోసా కలిగేలా విధులు ఉండాలి
- -విధి నిర్వహణలో అలసత్వం వహించిన సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవు








**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 2**

శాంతి భద్రతల పరిరక్షణ, మహిళల సమస్యల పరిష్కారానికి పోలీస్ అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ కందుకూరు సబ్ -డివిజన్లోని వలేటివారిపాలెం, లింగసముద్రం,కందుకూరు టౌన్, కందుకూరు రూరల్, గుడ్లూరు పోలీస్ స్టేషన్ లను, గుడ్లూరు సర్కిల్ కార్యాలయం కందుకూరు సబ్ డివిజన్ కార్యాలయమును సందర్శించి, స్టేషన్ స్థితిగతులు సిబ్బంది పని తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణం, వివిధ గదులు, మహిళా సహాయక కేంద్రం, రిసెప్షన్ కౌంటర్తో పాటు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అలాగే స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, సీడీ ఫైల్స్ సహా పలు రికార్డులను తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ పరిరక్షణ, నేర నివారణకు చేపడుతున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అలాగే పోలీస్ స్టేషన్లో పెండింగ్లో ఉన్న కేసుల స్థితిగతులను పరిశీలించి, వాటి దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి ఫిర్యాదుదారులకు త్వరితగతిన పరిష్కారం అందించాలని ఆదేశించారు.

ప్రతి కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సీ.డి. ఫైల్లో సక్రమంగా నమోదు చేసి దర్యాప్తు ప్రక్రియ సజావుగా సాగేలా, దర్యాప్తు నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త చట్టాలప్రకారం రిజిస్టర్ లను కూడా కొత్త ప్రోఫార్మా ప్రకారం జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ప్రతి స్టేషన్ పరిధిలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలకు సంబంధించిన ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించకుండా, వాటిపై విచారణ వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలి.

శక్తి టీములు, మహిళా పోలీస్లు, డ్వాక్రా మహిళలు సమన్వయంతో మహిళలకు ఉన్న చట్టపరమైన హక్కులు, రక్షణ చట్టాలు, శక్తి యాప్ గురించి వివరించాలని, శక్తి టీమ్ సభ్యులు, గ్రామ పోలీసులతో కలిసి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మహిళాలు, పిల్లలు భద్రతాకు



శక్తి టీములు సమర్ధవంతంగా విధులు నిర్వహించే విధంగా సైబర్ నేరాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాలన్నారు.

రహదారి ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతూ నిరంతరం ప్రమాదాలు జరిగే ప్రాంతాలను, జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను బ్లాక్ స్పార్ట్స్ గా గుర్తించి ఆ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, బారికేడ్స్, రేడియం స్టిక్కర్స్ తో కూడిన డ్రమ్ములు ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలి. రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని, వాహనాలు నడిపిటప్పుడు తనపై ఒక కుటుంబం ఆధారపడి ఉండుందని గుర్తుచేస్తుకోవాలని, హెల్మెట్ ధరించాలని, మద్యం తగి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రతపై అవగాహనా పెంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రకారం వాహనాలు నడపటంతోపాటు ప్రజలలో మార్పు వచ్చినపుడు రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఎన్ఫోర్స్మెంట్ ను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. బహిరంగ మద్యపానం జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి అవసరమైన తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ అధికారులకు సూచించారు. అలాగే ఆయా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బహిరంగ మద్యపానాన్ని నియంత్రించడం ద్వారా నేరాల శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఇప్పటి వరకు కందుకూరు టౌన్ పరిధిలో 16 బహిరంగ ప్రదేశాలను పోలీసు, స్థానిక ప్రజలు శుభ్రం చేసినట్లు తెలిపారు. కేసుల దర్యాప్తులో సిబ్బందిని కూడా భాగస్వాములను చేసి వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే పాత నేరస్థులు, అనుమానితులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి జీవన విధానం తదితర విషయాలను తెలుసుకోవాలని, వారి కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక/చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచాలని అధికారులను జిల్లా ఎస్పీ గారు ఆదేశించారు.

ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ సమర్ధవంతంగా విధులు నిర్వహించేలా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే ప్రతిరోజు పై అధికారుల నుంచి వచ్చే ఆదేశాలను క్రింది స్థాయి సిబ్బందికి సమర్థంగా తెలియజేయాలని, ఆదేశాలకు అనుగుణంగా సిబ్బంది విధులు నిర్వర్తించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు గ్రామా/వార్డులకు వెళ్లి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. జిల్లా ఎస్పీ వెంట కందుకూరు డిఎస్పీ బాలసుబ్రమణ్యం, కందుకూరు సీఐ షేక్ అన్వర్ బాషా, గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, సబ్ డివిజన్ ఎస్సై లు మరిడి నాయుడు, శివ నాగరాజు, బాలకృష్ణ జి.మంగారావు సిబ్బంది ఉన్నారు.

# జర్నలిస్టులపై వేధింపులు ఖండించండి

## - ప్రజా సంఘాల పిలుపు



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఫిబ్రవరి 02**

ప్రజాస్వామిక జర్నలిస్టులపై వేధింపులను రాజ్యాంగబద్ధంగా ఖండించాలని, ప్రజలు ప్రజాస్వామిక వాదులు వారికి అండగా నిలవాలని పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఒంగోలు అంబేద్కర్ భవనంలో డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం- ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టులపై వేధింపులను నిరసిస్తూ ప్రజాసంఘాల సమన్వయంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం గౌరవ సలహాదారులు,న్యాయవాది డాక్టర్ నూకతోటి రవికుమార్ అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ దేశంలో ఈ పదేళ్ల కాలంలో 20 మందికి పైగా జర్నలిస్టులను హత్య చేశారని, 150 మందికి పైగా జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాదులు షేక్ కరీముల్లా, మన్నం సుధీర్, రైతు సంఘం నాయకులు చండూరి రంగారావు, ఓపిడిఆర్ అధ్యక్షుడు చావలి సుధాకర్, ఏఐ బిఎస్పీ ప్రతినిధి ధరణికోట లక్ష్మీనారాయణ బి వై సి జిల్లా అధ్యక్షుడు మిరియం శ్రీనివాస్,మాల జేఏసీ కొండలు, వి కే సి జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆదినారాయణ, సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా సెక్రెటరీ అబ్దుల్ సత్తార్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు బొట్ల తదితరులు ప్రసంగిస్తూ రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను బతికిస్తున్న జర్నలిస్టులకు అండగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ సందర్భంగా తౌలుత, మైనింగ్, ఇసుక మాఫియా చేసిన హత్యల కారణంగా చనిపోయిన జర్నలిస్టులకు నివాళులర్పిస్తూ కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత కత్తి కళ్యాణ్ సంపాదకత్వంలో ప్రచురిస్తున్న' మన కాలం' మాసపత్రికను ఆవిష్కరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రసన్న రాజు,ఉద్యోగుల ఐక్యవేదిక తుల్లిబిల్లి అశోక్, విద్యార్థి సంఘ జేఏసీ అధ్యక్షుడు రాయపాటి జగదీష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద మాదిగ, రచయితల సంఘ అధ్యక్షుడు ఏఁజ్రా శాస్త్రి, వాజా రాష్ట్ర అధ్యక్షుడు గుండా మల్లికార్జున్ రెడ్డి,న్యూస్ 99 బ్యూరో స్టాలిన్ బాబు, జర్నలిస్టులు షేక్ కరిముల్లా, గురు కాంతాచారి,నాగార్జున్ రెడ్డి, కళాంజలి సుబ్బారావు, వజ్రాయుధం రామకృష్ణ, గద్దల శివాజీ, రత్నం, నూకతోటి శరత్ బాబు, బెంజిమెన్,సంజీవరావు, కాలేషా వలి, రజని,కవి మధుర శ్రీ, డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం కన్వీనర్ బొడ్డు శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు షేక్ నాసిర్ అహ్మద్, పాలపర్తి సతీష్,తెలగతోటి భరత్ కుమార్, పైనం సురేంద్ర, యోన,సంతోష్,జాన్ బాబు, సూరజ్,సురేంద్ర,మురళి, ప్రకాశం జిల్లా కిసాన్ మోర్చా వేముల మోజేష్, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com